తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## పట్టపగలే టిటిడి ఉద్యోగి ఇంట్లో భారీ చోరీ



తిరుపతి, జూన్ 24(ప్రభాతవార్త):
తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటపతినగర్‌లో బుధవారం మధ్యాహ్నం పట్టపగలే చోరీ జరిగింది. స్థానికంగా నివాసముంటున్న యశోదమ్మ టిటిడిలో విధులు నిర్వ హిస్తూంది. తన కుమార్తె మనవరాళ్ళ తో కలసి బుధవారం మధ్యాహ్నం షాపింగ్ కోసం వెళ్ళారు. ఇంటి బయట ఆవరణలోని వాషింగ్ మిషన్‌లో తాళాలు ఉంచి వెళ్ళారు. ఈ తాళాలుతీసుకుని దొంగలు ఇంటి తలుపులు బీరువాను తెరచి నగలున్న లాకర్‌ని ఎత్తుకెళ్ళారు. షాపింగ్ నుండి తిరిగి వచ్చిన మనవరాళ్లు తలుపులు తెరచి ఉం డడాన్ని గమనించి యశోదమ్మకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న తిరుపతి రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ తో ఆధారాలు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నట్లు తిరుపతి రూరల్ సిఐ మద్దయ్యఆచారి తెలిపారు.

## అదుపుతప్పిన గ్రానైట్ రాయి లారీ

### లారీని అడ్డుకున్న ప్రొటెక్షన్ వాల్ .. డ్రైవర్ క్లీనర్ సురక్షితం



చంద్రగిరి, జూన్ 24 ప్రభాతవార్త:
భాకరాపేట ఘాట్ రోడ్‌లో గ్రానైట్ లారీ అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయి ప్రొటెక్షన్ వాల్ బల మైనధాటితో తృటిలో ప్రమాదంలోకి జారుకోకుండా నిలువరిం చింది. పీలేరు - తిరుపతి ప్రధాన రహదారి భాకరాపేట ఘాట్ రోడ్‌లో బుధవారం గ్రానైట్ రాళ్ళు లోడుతో వస్తున్న లారీ ప్రమాదకరమైన మలుపు వద్ద అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో లారీ వేగం నిరోధించడంలో లోడ్ కారణంగా డ్రైవర్ విఫలమైనట్లు తెలుస్తున్నది. మలుపు కారణంగా కేవలం 30-20 కిలోమీటర్ల స్పీడ్‌తో వస్తేనే ప్రమాదం నుండి తప్పించుకునే అవకాశం వుంటుందని వాహన చోదకులు వాపోతున్నారు. అయితే ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.

## సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు లేనట్లే!

### జూన్ నెలాఖరుకు విత్తాల్సివుంటే ఇప్పటికీ జాడ కన్పించని వైనం



చిత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త:
ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంగా వేరుసెనగ సాగు చేసి మంచి దిగుబడి సాధించాలంటే జూన్ నెలాఖరులోపు విత్తనాలు విత్తడం పూర్తి కావాలి. జిల్లా రైతాంగానికి అవసరమైన సబ్సిడీ వేరుసెనగ విత్తనాలను వ్యవసాయశాఖ ఈ సీజన్‌లో సకాలంలో సరఫరా చేయలేదు. జిల్లాలోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో వేరుసెనగ పంట సాగు చేయడానికి వ్యవసాయశాఖ పంపిణీ చేసే సబ్సిడీ వేరుసెనగ విత్తనం కోసం ఎదురుచూపు చూస్తున్నారు. జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మే, జూన్ నెలల్లో అడపా దడపా వర్షాలు కురిసాయి. ఈ ప్రాంతాల్లో వున్న రైతులు ఖరీఫ్ వేరుసెనగ సాగుకు తమ పొలాలను దుక్కి దున్ని చేసి సిద్ధం చేశారు. అయితే ఇలాంటి రైతులకు సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో ఈ సీజన్‌లో వేరుసెనగ విత్తడం ఎలాగని దిగులు చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుసెనగ మంచి దిగుబడి సాధించాలంటే జూన్ 15 నుండి జూన్ నెలాఖరు వరకు విత్తనం విత్తడం పూర్తి కావాలి. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం నెలకొనడంతో ఈ సీజన్ ప్రారంభంలో ఆశించిన విధంగా జిల్లాలో ఎక్కడా వర్షాలు నమోదు కాలేదు. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రం మే నెలాఖరు, జూన్ ప్రారంభంలో ఓ మోస్తరు వర్షాలు కురవడంతో అక్కడి రైతులు తమ పొలాలను దుక్కి దున్ని పంటల సాగుకు సిద్ధం చేశారు. జూన్ నెలాఖరు నాటికి వేరుసెనగ విత్తి పూర్తి కావాల్సివుండటంతో వ్యవసాయశాఖ రైతులకు ఇప్పటికిప్పుడు విత్తనాలు సరఫరా చేసినా వాటిని విత్తడానికి సిద్దం చేసుకోవడానికి రైతులకు ఒక వారం రోజుల సమయం పడుతుంది. అప్పటి వరకు ఓ మోస్తరు వర్షం కురిసినా జూన్ నెలాఖరు నాటికి వేరుసెనగ విత్తడం రైతు పూర్తి చేస్తాడు. అయితే ప్రస్తుతం రైతు వద్ద ఎలాంటి వేరుసెనగ విత్తనం లేకపోవడంతో ఓ మోస్తరు వర్షాలు కురిసి విత్తడానికి పంట పొలాలను సిద్ధం చేసుకున్న రైతుల వద్ద విత్తనాలు లేకపోవడం, అలాగే ఇప్పటికీ పొలాలను దుక్కి దున్నని రైతుల వద్ద సైతం విత్తనాలు లేకపోవడం ఆందోళన కల్గిస్తుంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో మెట్ట ప్రాంతాల్లో వర్షాధారంతో వేరుసెగన పంట సాగు చేయడానికి ప్రభుత్వం 27,225 క్వింటాళ్ల సబ్సిడీ వేరుసెనగ విత్తనాలను జిల్లాకు కేటాయించింది. మే నెలాఖరు నాటికి సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు జిల్లాకు చేరాల్సివుండగా జూన్ 15 నాటికి సైతం జిల్లాకు సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు రాలేదు. అనంతపురం, కర్నూలు జిల్లాల నుండి సబ్సిడీ విత్తనాలు రావాల్సివుండగా అక్కడి నుండి జూన్ 15 తరువాత సబ్సిడీ వేరుసెనగ విత్తనాల తరలింపు ప్రారంభమైంది. జిల్లాకు ఇప్పటి వరకు కేవలం 3 వేల క్వింటాళ్ల వేరుసెనగ విత్తనాలు మాత్రమే వచ్చి చేరాయి. జిల్లాకు ఇంకా 24 వేల క్వింటాళ్ళ వేరుసెనగ విత్తనాలు రావాల్సివుంది. వచ్చిన విత్తనాలు సైతం కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని కొన్ని మండలాలకు మాత్రమే రావడంతో అక్కడి వ్యవసాయ అధికారులు వచ్చిన విత్తనాలను రైతులకు విక్రయించారు. జిల్లాలోని మిగిలిన రైతులు సబ్సిడీ వేరుసెనగ విత్తనాల కోసం ఎదురు చూపులు చూస్తున్నప్పటికీ జూన్ నెలాఖరు కావస్తుంటంతో ఈ సీజన్‌లో రైతుకు సబ్సిడీ వేరుసెగన విత్తనంను ప్రభుత్వం పంపిణీ చేసి పంట సాగుకు సహకారం అందిస్తుందా! లేక అదను తప్పిందని, వర్షాలు నమోదు కాలేదని వేరుసెనగ విత్తే రైతుకు విత్తనం పంపిణీ చేయకుండా ప్రభుత్వం ఎగనామం పెడ్తుందా! రెండు మూరు రోజుల్లో తేలనుంది.

## దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ..**
**తిరుపతి అభివృద్ధిని అడ్డుకునే దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు..**
**జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్..**




తిరుపతి కలెక్టరేట్ , జూన్ 24 ప్రభాతవార్త:..
తిరుపతి నగరం, పరిసర ప్రాంతాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూ, స్టాంపులు , రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని విసి హాల్ నందు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా ఛైర్మన్ మరియు ఇతర ఉన్నతాధికారులతో కలిసి భూ సమస్యలపై నిర్వహించిన సమీక్ష అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని ఆదేశించారన్నారు. ముఖ్యంగా పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరిష్కార మార్గాలను రూపొందిస్తున్నామన్నారు. దామినేడు, శ్రీనివాసపురం, పద్మావతి నగర్, సాయినగర్, కరకంబాడి, సీతారాం నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై సమగ్రంగా చర్చించామని, సంబంధిత అధికారుల నుంచి నివేదికలు సేకరించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. తిరుపతి నగర ప్రాంతంలో వివిధ రకాల భూ వర్గీకరణల కారణంగా దశాబ్దాలుగా సమస్యలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. మఠం భూములు, చెరువులు, కాలువలు, వాగులు, రివర్ పోరంబోకు తదితర భూములపై వేలాది కుటుంబాలు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నప్పటికీ పూర్తి హక్కులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దామినేడు ప్రాంతంలో సుమారు 262 ఎకరాల్లో సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్నాయని, అనేక సంవత్సరాలుగా భూముల కొనుగోలు విక్రయాలు జరిగినప్పటికీ రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు, విద్యా అవసరాల కోసం ఆస్తులను వినియోగించుకునే అవకాశం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేదలకు భూ హక్కులు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించినట్లే, ప్రస్తుతం ఉన్న సమస్యలపై కూడా చట్టబద్ధమైన పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నామన్నారు. డీకేటీ భూములు, పీవోటీ నిబంధనల కారణంగా ఉత్పన్నమైన సమస్యలను కూడా అధ్యయనం చేసి, చట్టబద్ధంగా ప్రజలకు హక్కులు కల్పించే అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. రూరల్ , అర్బన్ ప్రాంతాల్లో ఎక్కడెక్కడ భూ సమస్యలు ఉన్నాయో గుర్తించి, అవసరమైతే కేబినెట్ స్థాయిలో నిర్ణయాలు తీసుకుని పరిష్కారానికి చర్యలు చేపడతామని వెల్లడించారు. తిరుపతిని రాష్ట్ర అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ, ఉపాధి అవకాశాలు పెంచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తిరుచానూరు మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి ఆమోదం లభించిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అవిలాల చెరువు అభివృద్ధికి తొలి దశలో రూ.31 కోట్లతో టెండర్లు పిలిచామని, మొత్తం రూ.110 కోట్ల వ్యయంతో సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలు చేయనున్నట్లు తెలిపారు. పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసి, తిరుపతికి వచ్చే భక్తులు అదనంగా ఒకటి లేదా రెండు రోజులు గడిపేలా మోలిక సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.కొంతమంది రాజకీయ నాయకులు మరియు సోషల్ మీడియా వేదికల ద్వారా తిరుపతి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్.సుబ్బరాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ ,ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, ఏపి మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు పాల్గొన్నారు.

## సిఎం సొంత జిల్లాలో కూటమి ఎమ్మెల్యేల నియంత ధోరణి !

తిరుపతి-ప్రభాతవార్త న్యూస్‌బ్యూరో:
సిఎం చంద్రబాబునాయుడు పదేపదే ఎమ్మెల్యేలను హెచ్చరిస్తున్నా వారి పనితీరులో మార్పు రావడంలేదనే సమాచారం తన వేగుల ద్వారా బాబుకు చేరుతోంది. ముఖ్యంగా ఆయన సొంత జిల్లాలైన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కొందరు కూటమి ఎమ్మెల్యేలు రెండేళ్ళు కావస్తున్నా నియంత ధోరణితో వ్యవహరిస్తున్నారని పలువురు సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి గత ఐదేళ్ల పాలనలో పోరాటం చేసిన వారిని పక్కన పెట్టి తమకు కావాల్సిన వారిని నెత్తిన పెట్టు కుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక, గ్రావెల్, గ్రానైట్ అక్రమంగా చెన్నై, కర్ణాటక ప్రాంతాలకు తరలించి కోట్లు గడిస్తున్నారంటూ అధిష్టానానికి ఫిర్యాదులు చేస్తున్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన కుటుంబ సభ్యులకు అధికారం అప్పగించారని, ఆయన తన సొంత పార్టీలోని జన సైనికులను పట్టించుకోవడం లేదనేది జనసైన్యం చెబుతున్న మాటలు. టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలకు ఏమాత్రం అందుబాటులో లేకపోయారు. ఆయన సొంత వ్యాపారాలు చూసుకుంటున్నారనేది ప్రధాన ఆరోపణలు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కష్టకాలంలో పార్టీకి సేవలు అందించిన మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడును పూర్తిగా పక్కన పెట్టేశారు. బిసి వర్గానికి చెందిన జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ రెడ్డివారి



గురవారెడ్డికి పార్టీ పదవి రాకుండా అడ్డు పడ్డారని, ఆయన అనుచరులు శ్రీకాళహస్తి ఆలయంలో సర్వం తామే అన్నట్టు వ్యవహరిస్తున్నారనేది ప్రధాన ఆరోపణలు. ఆయన అనుచరులు కొందరు నుంచి రోజూ ఇసుక, గ్రావెల్ తరలిస్తున్నారనేది విమర్శలు. సత్యవేడు నియోజక వర్గం అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. అక్కడ పార్టీ ఇంచార్జి శంకర్ రెడ్డి, ఎమ్మెల్యే ఆదిమూలం అనుచరులు పోటీ పడి ఇసుక అక్రమంగా తరలించేస్తున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిపై పలు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఆయన అనుచరులు కోట్ల రూపాయల విలువ చేసే భూములను కబ్జా చేస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో పలు కథనాలు వస్తున్నాయి. జి డి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అధిస్థానం హెచ్చరికలతో కొంత తగ్గినప్పటికీ ఆయన అనుచరుల ఆగడాలు తగ్గలేదంటున్నారు. కార్వేటినగరం మండలం నుంచి గ్రావెల్ అక్రమ రవాణా ఆగలేదని జనం వాపోతున్నారు.పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరినీఖాతరు చేయడం లేదనే వాదనలు గుప్పుమంటున్నాయి. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ నాయుడు ప్రజలకు అందుబాటులో ఉన్నా సీనియర్ నేతలకు పదవులు రాకుండా అడ్డుపడ్డారని పార్టీ వర్గాల్లో బలంగా వ్యాఖ్యలు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పని తీరు సంతృప్తి కరంగా లేదని,ఆయన .పార్టీ నేతలకు,కార్యకర్తలకు అందుబాటులో లేరనేది ప్రధాన విమర్శలు. పలమనేరు ఎమ్మెల్యే ,సీనియర్ నేత ఎన్ అమరనాథ రెడ్డి బెంగళూరులో సొంత వ్యాపారాలు చక్క బెట్టుకుంటున్నారనేది పార్టీ వర్గాల్లో వ్యాఖ్యలు. ప్రజలకు మంచి చేస్తే మళ్ళీ ఎమ్మెల్యేలవుతారని, లేకుంటే ఒకసారి ఎమ్మెల్యేలుగా మిగిలిపోతారని నిర్మొహమాటంగా సిఎం చంద్రబాబు హెచ్చరిస్తున్నా పార్టీ ఎమ్మెల్యేలు బేఖాతర్ చేస్తుండటం ఓటరు దేవుళ్ళే మరో మూడేళ్ళలో తీర్పునిస్తారనేది జనంలో చర్చ మొదలైంది.

## భోగశ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్రకలశాభిషేకం



తిరుమల, జూన్ 24ప్రభాతవార్తప్రతినిధి:
తిరుమల ఆలయంలో భోగ శ్రీనివాసమూరికి బుధవారం ప్రత్యేక సహస్రకలశాభిషేకం వేడుకగా జరిగింది. శ్రీవారి ఆలయంలోని గరుడాళ్వార్ సన్నిధిలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి, భోగ శ్రీనివాసమూర్తి, విష్వక్సేనులవారిని వేంచేపు చేశారు. శ్రీవారి మూలమూర్తికి ముందు గరుడాళ్వార్ సన్నిధిలో కౌతుకమూర్తి మనవాళపెరుమాళ్(శ్రీ భోగ శ్రీనివాసమూర్తి)ను, ఆయన కు అభిముఖంగా విష్వక్సేనులవారిని ఉంచారు. వేద పండితులు వేద పారాయణం చేయగా, అర్చకస్వాములు ప్రత్యేక సహస్రకలశాభిషేకం వైభవంగా నిర్వహించారు.

## సీఎం సభ ప్రాంగణాన్ని కూటమి నాయకులు పరిశీలన

ఓబులవారిపల్లి 24 జూన్ ప్రభాత వార్త
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం ముక్కా వారి పల్లి సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా బుధవారం టిడిపి ఇంచార్జ్ కూడా ఛైర్మన్ ముక్కారూపానందరెడ్డి మరియు ఎమ్మెల్యే ఆర్వ శ్రీధర్ మరియు కూటమి నాయకులు. సీఎం బహిరంగ సభాప్రాంగణాన్ని పరిశీలించారు. పర్యటన ముఖ్య ఉద్దేశం కేంద్ర ప్రభుత్వం మంత్రులు వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజు గార్ అండ్ అజీవ్గా మిషన్ గ్రామీణ్ పథకం 2026 సంబంధించి ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి ఆ పథకం పేరు కొత్తగా జూలై ఒకటో తేదీ నుంచి ఉపాధి హామీ పథకం స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ పర్ రోజు గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ పథకం 2026 పథకాన్ని ప్రవేశ పెట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంత్రులు కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు. శివరాజ్ సింగ్ చౌహాన్ కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజిన్ సింగ్ మరియు రాష్ట్ర



మంత్రివర్యులు పవన్ కళ్యాణ్ రానున్నట్లు సమాచారంఈ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ పోలీసు ఉన్నతాధికారులు సిఐ శ్రీనివాసులు ఓబులవారిపల్లి ఎస్సై సుజన్ కుమార్ ఇంటలిజెన్సీ హెడ్ కానిస్టేబుల్ రంగనాథ్. నాగేంద్ర కూటమి నాయకులు యువ నాయకులు ముక్కాసాయి వికాస్ రెడ్డి. గుత్తి నరసింహులు శివయ్య నాయుడు తల్లిని వెంకటరమణారెడ్డి మరియు కూటమి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కన్నీటి పర్యంతం

### దారుణం జరిగిపోయింది: ధైర్యంగా ఉండండి: నేతల ఓదార్పు

### అంత్యక్రియలకు వినతూ కోట ఆర్థిక సహాయం

శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదవి ట్రిబుల్ ఐఐటిలో సీటు సాధించి కౌన్సె లింగ్ కు వెళ్ళు సమయంలో కడపజిల్లా పుల్లంపేట వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన యశ్విత అంత్యక్రియలు బుధవారం శ్రీకాళహస్తిలోని పట్టలవారి సందులో వారి స్వగృహం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇరుగుపొరుగు, పాఠశాల సహ విద్యార్థులు, ఉపాధ్యాయులు కన్నీటి పర్యంతమయ్యారు. మూడురోజుల క్రితం జరిగిన ప్రమాదంలో యశ్విత మృతి చెందగా వారి సొదరి తీవ్ర రక్తగాయాలతో తిరుపతిలోని ఓ ప్రవేటే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇక స్వల్పగాయాలతో తల్లిబయట పడగా తండ్రి దినకర్ కాళ్ళు విరిగి సర్జరి జరిగింది. నవ్వుతూ ఉదయం కౌన్సె లింగ్‌కు బయలు దేరిన కుటుంబసభ్యులు గమ్యం చేరక ముందే యముడి రూపంలో ఓ లారీ కబళించింది. దాంతో దినకర్ కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. బుధవారం యశ్విత మృత దేహాన్ని తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపారు. యశ్వితకు కడసారి వీడ్కోలు కన్నీటితో పలికారు.

ఓదార్పులు:
శ్రీకాళహస్తికి చెందిన దినకర్ కుమార్తె ప్రభుత్వ పాఠశాలలో చదివి తమ ప్రతిభతో ట్రిబుల్‌ఐటిలో సీటు సాధించటం కౌన్సె లింగ్‌కు వెళ్ళు సమయంలో మృత్యువు కబళించటం కుటుంబం కకావికలం కావటంతోజనం చలించిపోయారు. ఈ నేపధ్యంలో బుధవారం అంత్యక్రియల సందర్భంగా శ్రీకాళహస్తి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ హాజరై యశ్విత తల్లిదండ్రులను ఓదార్చింది.యశ్విత భౌతికాయానికి పూల మాలలు సమర్పించి నివాళులర్పిం చింది. తమ నియోజకవర్గంలోని ఓ విద్యాకుసుమం రాలిపోయిందని కంటతడిపెట్టారు. తల్లి





అంత్యక్రియల్లో తల్లిని ఓదార్చుతున్న బృందమ్మ

దండ్రులను ఓదార్చుతూ సుధీర్‌రెడ్డితో వివరించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించే విధంగా ఆదుకుంటా మన్నారు. అన్ని విధాల దినకర్ కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

శ్రీకాళహస్తి పిట్టల వారి సందులో నివాసముంటూ తాను కాయకష్టం చేస్తూ తమ ఇద్దరు ఆడబిడ్డలను చక్కగా చదివించుకుంటూ ప్రయోజకకుల్ని చేస్తున్న సమయంలో విధి వక్రీకరించి రోడ్డు ప్రమాదంలో చేతికందివచ్చిన విద్యా అవకాశాన్ని పోగొట్టుకొని విగత జీవిగా మారిన యశ్విత మృతదేహానికి జనసేన మాజీ శ్రీకాళహస్తి ఇన్‌చార్జి వినూత కోట నివాళులర్పించారు. దహన క్రియలకు ఆర్థికంగా రూ.25వేలు కుటుంబసభ్యులకు అందించారు.ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన మరో కుమార్తె ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని త్వరగా కోలుకోవాలని వినూత కోట తల్లిదండ్రులకు అన్ని విధాల ఆదుకుంటామన్నారు.

## సచివాలయ ఉద్యోగిపై పాక్సో ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులు

నాయుడుపేట, జూన్ 24, ప్రభాతవార్త
నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో తీవ్ర కలకలం రేగింది. నిబంధనలను ఉల్లంఘించి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడిన ఒక సచివాలయ ఉద్యోగిపై మున్సిపల్ కమిషనర్ ప్రజురుల్లా అధికారికంగా వేటు వేశారు. భారత్‌నగర్ సచివాలయం అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న ఓ.విజయరామయ్యను సస్పెండ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ అత్యవసర ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయం ఉద్యోగి ఓ. విజయరామయ్యపై ఇటీవల తీవ్రమైన సెక్షన్ల కింద చట్టపరమైన కేసులు నమోదయ్యాయి. ఆయనపై నమోదైన ఎఫ్ఐఆర్ నంబర్ 176/2026 ఆధారంగా మున్సిపల్ యంత్రాంగం ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. విజయరామయ్యపై భారతీయ న్యాయ సంహిత, చిన్న పిల్లల లైంగిక వేధింపుల నిరోధక చట్టం, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టాల కింద కేసులు నమోదైన నేపథ్యంలోనే ఈ సస్పెన్షన్ వేటు వేసినట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ తీవ్రమైన ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ ముగిసే వరకు సదరు ఉద్యోగి ఓ. విజయరామయ్య ప్రభుత్వ విధులకు పూర్తిగా దూరంగా ఉండవలసి ఉంటుందని కమిషనర్ తమ ఆదేశాల్లో స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ ఇలాంటి అరాచకాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఈ చర్య ద్వారా మున్సిపల్ యంత్రాంగం గట్టి సంకేతాలు పంపింది. ఈ ఘటన స్థానికంగా మరియు ప్రభుత్వ ఉద్యోగ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

25-6pg9:25-6pg9.qxd 6/24/2026 11:13 PM Page 1





# ఎవరేమనుకున్నా... అంతే..?

ఫలానా సెలిబ్రిటీకి పెళ్లెప్పుడు? ఎవరితో? సెలబ్రెటీల విషయంలో ఇలాంటి ఊహాగానాలన్నీ సర్వసాధారణం. కానీ సోషల్ మీడియా వచ్చాక అర్థం పర్థం లేని, ఒకవేళ అర్థమున్నా సామాన్యులకేమీ అక్కర్లేని విషయాలు ఊర్లన్నీ తిరిగొచ్చేస్తున్నాయి. అదేనండీ! డిజిటల్ వేదికల మీద వైరల్ అవుతున్నాయి. సీనియర్ బాలీవుడ్ నటి ఛోళీకె పీచా క్యాహై నటీమణి నీనాగుప్త క్యారీయింగ్ కాబోలు? సమంత నీళ్లోసుకుందా? అదెప్పుడు. ఆమెకు సారె కూడా అందిందా! అదెలా సోషల్ మీడియాలో ఇలాంటి వార్తలు ఎంతో అనుచితమైనా ఉచితంగా దేశమంతా చుట్టేస్తున్నాయి. మాకూ రాయడానికి ఓ పద్ధతుంటుం దని సాదా సీదా జర్నలిస్టులంటుంటే? మాకలాంటివేమీ లేవని సోషల్ మీడియా వాళ్ల ఘోష. వాటిలో ఎంత మేరకు నిజాలుంటాయో తెలియని విషయం కాదు. అదేమీ కాకుండా ఉబుసపోక విషయాలను అనుచితంగా వ్యాపింపచేయడంలో మాకు మేమే సాటి! అని సోషల్ మీడియా కాలరెత్తుకు తిరిగేస్తుంటే ఏమనుకోవాలి? ప్రజాజీవితంలో కొస్తే ఏమైనా అంటాం.. అనే ధోరణిలో సినీ జీవితంలో ఉంటే ఏదైనా అంటాం,, అనుకుంటున్నట్టుంది. వివిధ సామాజిక మాద్యమాల్లో 'మా యింటి బంగారం' సినిమా సక్సెస్ సెలెబ్రేషన్స్ సంబంధించిన ఫొటో ఒకటి వైరల్ అయింది. అందులో సమంత బేబీ బంప్'తో కనిపించారని ఆ మధ్య ఒకటే గోల. అదేమైనా అంత అవసరమా భ్రమలను సమాజానికి చెప్పేద్దాం.. అనే లేక జాతి జనులంతా పండగ చేసుకునే విషయామా? ఇలాంటివేమీ తెలకుండానే సోషల్ మీడియా తమకవసరంలేని భ్రమలను ఆగ మేఘలమీద సమాజానికి చెప్పేద్దాం.. అనే ధోరణిలో అంశాలుగా చేసి చూపించేస్తున్నాయి. ఆ మధ్య నటీమణి 'నీనాగుప్త' విషయంలో ఇలాగే ఊహించేశారు. అయినా ఆమె ఎంతో మర్యాదగా స్పందించారు. ఇప్పుడూ ఇలాగే అనవసర, అనుచిత స్పందనతో సామాజిక మాధ్యమాలు నవ్వుల పాలవుతున్నాయి. ఒకప్పుడు సెలబ్రిటీల సినిమాల, అవార్డులు, ఫ్యాషన్ మాత్రమే వార్తల్లో ఉండేవి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా, వర్చువల్ రియాలిటీ, డిజిటల్ గాసిప్ ఎకానమీ కలిసి 'బేబీ బంప్'ను ఒక వ్యక్తిగత అనుభవం నుంచి ప్రపంచ, వినోదంగా మార్చేశాయి. మొన్నా ఈ మధ్య విజయ్ దేవరకొండ రష్మిక మందన్న వివాహ రిసెప్షన్‌కు హాజరైన నటి నీనా గుప్తాకు సంబంధించిన ఒక వీడియో వైరల్ అవ్వడం వల్ల ఆమెకు బేబీ బంప్ ఉందని సోషల్ మీడియాలో పుకార్లు వచ్చాయి. తాను ఆమె ధరించిన చీర, దాని వస్త్రశైలి వల్ల కెమెరా యాంగిల్‌లో అలా కడుపు ఉబ్బినట్లుగా కనిపించిందేమోనని అంటూనే. ఈ విషయంపై నీనా గుప్తా 66 ఏళ్ల వయసులో, నేనా గర్భవతినా.. అని నవ్వుకుంటూనే కోపంగా స్పందించకుండా హాస్యంగా పరిస్థితిని హ్యాండిల్ చేశారు. నీనా గుప్తా స్పందన మాత్రం 'బదాయి హో' సినిమా సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, వయసు పైబడిన తర్వాత కూడా ఇలాంటి రూమర్స్ రావడంపై ఆమె సరదాగా నవ్వుకున్నారు. బాడీ షేమింగ్ లేదా శరీర ఆకృతి ఆధారంగా గర్భధారణ అని భ్రమసి కథ అల్లేయడం ఎంత మర్యాదకరం. ఈ ట్రెండ్ మొత్తం సరదాగా మాత్రమే ఉండదు. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై అతిగా దృష్టి పెట్టడం గోప్యతకు సవాలుగా మారింది. ఫన్నీ మీమ్స్, సిల్లీ ఊహాగానాలు, వివాదాస్పద చర్చలు ... ఇవి సెలబ్రిటీ సంస్కృతిలో భాగమే. కానీ అవి వ్యక్తిగత గోప్యత, గౌరవం, బాధ్యత వంటి విలువలతో సమతుల్యం కావడం ప్రస్తుత సమాజంలో అవసరం ఒక పెద్ద డిజిటల్ వ్యాపారనికి ప్రధాన వస్తువులై పోవడం ఆశ్యర్యకరం. అవి కొన్నిసార్లు నవ్విస్తాయి, కొన్నిసార్లు ఆశ్చర్యపరుస్తాయి, మరికొన్నిసార్లు వివాదాలకు దారి తీస్తాయి. మరికొన్ని సార్లు జుగుప్సాకరం గానూ అనిపిస్తాయి. ఫ్యాషన్ బ్రాండ్లు, మాతృత్వ ఉత్పత్తుల కంపెనీలు, ఆరోగ్య యాప్‌లు, బేబీ ప్రిడిక్షన్ స్టార్టప్‌లు కలిసి ఈ ట్రెండ్‌ను మార్కెటింగ్ అవకాశంగా ఉపయోగించు కుంటున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్‌కు నటి త్రిష పుట్టిన రోజు అభినందనలు చెప్పారా ? లేక కచ్చి కొట్టేసారా.. అదో చర్చ, చివరకి వారిద్దరూ విందు భోజనం ఆరగిస్తున్న వార్త చేస్తే తప్పమనవాళ్లు కాస్తంత స్థిమిత పడలేదండోయ్! □

## వ్యథ



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

# మాటలు ఔషధం లాంటివే !

ప్రశ్న: నేను ఎంబీఏ తరువాత పి హెచ్ డి చేస్తున్నాను. అక్కడ ఒత్తిడికి తట్టుకోలేక డిప్రెషన్‌కు గురయ్యాను. అన్నం తినలేకపోయాను, నిద్ర పట్టలేదు, దుఃఖం ఎక్కువైంది. ఇంటర్‌లో ఉన్నప్పుడు ఒకసారి ఆత్మహత్యా ప్రయత్నం చేశాను. భయపడి సైకియాట్రిస్ట్‌ను కలిస్తే యాంటీడిప్రెసెంట్ మందులు ఇచ్చారు. వారం రోజులైనా పెద్ద మార్పు కనిపించలేదు. తరువాత మా నాన్న ఒక సైకాలజిస్ట్ వద్దకు తీసుకెళ్లారు. ఆయన నాతో మాట్లాడుతూ రెండు కిలోమీటర్లు నడిపించారు. ఎలాంటి ప్రత్యక్ష సలహాలు ఇవ్వకుండా కథలు చెబుతూ పరోక్షంగా ప్రేరణ కలిగించారు. ఆ రోజు నాకు ఆకలి వేసింది, బాగా నిద్రపోయాను. మరుసటి రోజు నా మెతక స్వభావం, భయపడే తత్వం, ఉద్వేగ నియంత్రణ లోపం, విటమిన్ డి లోపం కారణాలు అని చెప్పారు. మరి డిప్రెషన్ హార్మోన్ల లోపం వల్లే వస్తుందని అంటారు. అయితే ఆలోచనల వల్ల కూడా వస్తుందా? కౌన్సెలింగ్ వల్ల ఎలా తగ్గింది? శాస్త్రీయంగా వివరించండి. **- ఒక సోదరి, విజయవాడ**



**జవాబు:** అమ్మా, చాలామంది డిప్రెషన్‌ను కేవలం 'హార్మోన్ల లోపం" లేదా 'మెదడులో రసాయనాల అసమతుల్యత' వల్ల వచ్చే సమస్యగా భావిస్తారు. కానీ ఆధునిక మనోవిజ్ఞాన శాస్త్రం ప్రకారం డిప్రెషన్ జీవసంబంధ, ఆలోచనా విధానం, జీవన పరిస్థితుల పరస్పర ప్రభావం వల్ల ఏర్పడే మానసిక స్థితి. మన మెదడులో సెరోటోనిన్, డోపమైన్, నోరెపినెఫ్రిన్ వంటి రసాయనాలు మన భావోద్వేగాలను నియంత్రిస్తాయి. వీటి అసమతుల్యత వల్ల నిరాశ, నిద్రలేమి, ఆకలి తగ్గడం, జీవితంపై ఆసక్తి తగ్గడం జరుగుతుంది. యాంటీడిప్రెసెంట్ మందులు ఈ రసాయన సమతుల్యతను సరిచేయడానికి ఉపయోగపడ˜తాయి. అయితే వాటి ప్రభావం చాలాసార్లు 2-6 వారాల తరువాత స్పష్టంగా కనిపిస్తుంది. సున్నిత స్వభావం వల్ల చిన్న అపజయాన్ని కూడా పెద్ద ప్రమాదంగా ఊహించడం జరుగుతుంది. దీని వల్ల కార్టిసోల్ అనే స్ట్రెస్ హార్మోన్ ఎక్కువగా విడుదలై డిప్రెషన్‌ను మరింత పెంచుతుంది. అంటే˜ఆలోచనలు" కూడా మెదడు రసాయనాలపై ప్రభావం చూపుతాయి. మీ బాధలు పంచుకోవడం వల్ల మెదడులో ఒత్తిడి తగ్గింది. నడక వల్ల మెదడులో ఎండార్ఫిన్స్ విడుదలై సహజ ప్రశాంతత కలిగింది. ప్రత్యక్షంగా సలహాలు ఇవ్వకుండా కథలు చెప్పడం ద్వారా మీ ఆలోచనా విధానాన్ని పరోక్షంగా మార్చారు. దీనిని సైకాలజీలో కాగ్నిటివ్ రీఫ్రేమింగ్ అంటారు. ఒక సమస్యను కొత్త కోణంలో చూడగలిగితే భయం తగ్గుతుంది. అలాగే విటమిన్ డి లోపం కూడా డిప్రెషన్ ను పెంచుతుంది. డిప్రెషన్ అనేది శరీరం, మెదడు, మనసు, జీవనశైలి అన్నీ కలిపి ప్రభావితం చేసే పరిస్థితి. మందులు, కౌన్సెలింగ్, వ్యాయామం మనసును ప్రభావితం చేస్తాయి. మెదడులో రసాయనాలు మన ఆలోచనలను ప్రభావితం చేస్తాయి. మన ఆలోచనలు కూడా తిరిగి ఆ రసాయనాలను ప్రభావితం చేస్తాయి. అందుకే సరైన కౌన్సెలింగ్ చాలా సార్లు మందులతో సమానంగా ప్రభావం చూపుతుంది. □

# వినయంతో విద్య

విద్య వినయంతో రాణిస్తుంది. మన సారస్వతంలో ఇలా మెరుగులు దిద్దుకున్న వజ్రాల్లాంటి విద్యార్థులందరో! బృహస్పతి పుత్రుడు కచుడు. అతడు వినయశీలుడై శుక్రాచార్యుడి వద్ద శిష్యుడిగా చేరి 'మృత సంజీవని' విద్యను ఆర్జించగలిగాడు. కచుడు తన ప్రత్యర్థి బృహస్పతి కుమారుడని తెలిసి కూడా శుక్రా చార్యులు అతని వినయవిధేయతలకు ముగ్ధుడై శిష్యుడిగా స్వీకరించాడు. ప్రత్యక్షంగా గురువుకు, పరోక్షంగా పరమాత్మకు చేరువ చేసే లక్షణం అణకువ అని ప్రహ్లాదుడు, కచుడు సాధించాడు. భగవంతుడి ఉనికి స్పష్టమయ్యేది సహృదయంలోనే. మనసును కఠినం చేస్తే.. అలాంటి దసలు చదువే అనిపించుకోదు. మనలో లాలిత పెంచే పాఠశాల దేవాలయంతో సమానం. అందుకే తన వద్దకు వచ్చిన ఓ నిరక్షరాస్యుడైన భక్తుడితో 'చదువుతో పనేముంది, హృదయముంటే చాలు' అన్నారు. రమణ మహర్షి. నువ్వు శరీరం కాదు, ఆత్మస్వరూపుడివి అని తెలుసుకోవటమే అసలైన విద్య అన్నారాయన. ఆధ్యాత్మిక జ్ఞానం స్థైర్యాన్నిస్తుంది. భవిష్యత్తులో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా మానసిక ఒత్తిడి, కుంగుబాటులకు తావుండదు. అందుకే అన్నమాచార్యులు 'చదివి. బతుకరో సర్వజనులు మీరు' అన్న కీర్తనలో ప్రహ్లాదుడు చదివినట్టి చదువు చదవడ హితవు పలికారు. నరసింహస్వామి ప్రత్యక్షమైన తర్వాత ప్రహ్లాదుడు ఆధ్యాత్మిక సాధనలకే పరిమితం కాలేదు. గృహస్థ ధర్మాన్ని, రాజ్యపాలన బాధ్యతల్ని కూడా సమర్థంగా నిర్వహించాడు. గొప్ప చక్రవర్తిగా పేరుతెచ్చుకున్నాడు. మొదట అన్ని జ్ఞానాల కు మూలమైన పారమార్థిక జ్ఞానాన్ని ఆర్జించాలని నిరూపించాడు. ఆధ్యాత్మిక జ్ఞానం, అంతర్యామికి సంబంధించిన చదువు అన్ని విద్యలకు మూలమై నిలుస్తుంది. విద్యల్లో నేను ఆధ్యాత్మిక విద్యను అన్నాడు. గీతలో శ్రీకృష్ణభగవానుడు. మన ధర్మం లౌకిక, పారలౌకిక జ్ఞానాలను భిన్నంగడా చూడలేదు. పరమాత్మకు సంబంధించిన జ్ఞానం ప్రాపంచిక జ్ఞానానికి కూడా ఆధారమై నిలుస్తుందని స్పష్టమవుతుంది. □



# పనీర్ చమన్

ఒక్కో ప్రాంతానికి ఒక్కో సంస్కృతి ఉన్నట్టే. వంటల్లోనూ ఎవరి ప్రత్యేకతలు వారికున్నాయి. కశ్మీర్ వాసుల సంప్రదాయక వంటకం కశ్మీరీ పనీర్ చమన్. ఆకర్షణీయంగా ఉండే కశ్మీర్ ఆపిల్ పండ్లు చూస్తే.. ఎప్పుడెప్పుడు తినాలా అనిపి స్తుందో.. ఈ వంటకం కూడా అలాగే నోరూరిస్తుంది. ఇంతకీ దీన్నెలా చేస్తారంటే.. పనీర్‌ను చిన్న ముక్కలుగా కోసి.. ఒక పాత్రలో వేయాలి. కప్పు పాలల్లో చిటికెడు కుంకుమ పువ్వు వేసి, వేడిచేయాలి. లేత పసుపు రంగులోకి మారాక.. ఆ పాలను పనీర్ ఉన్న పాత్రలో పోయాలి. వాటినలా పక్కనుంచి కడాయిలో చెంచా నూనె వేసి రెండు బిర్యానీ ఆకులు, నాలుగు యాలకులు, ఐదు లవంగాలు, కొంచెం పుదీనా, ఉల్లి తరుగు, అల్లం వెల్లుల్లి పేస్టు పసుపు వేసి వేయించాలి. అవి వేగాక కప్పు పాలు పోసి.. మూడు నిమిషాలు మరిగించాలి. ఇందులో పనీర్ ముక్కలున్న పాలను జతచేసి.. మధ్య మధ్యలో కలియ తిప్పుతూ మరిగించాలి. చిక్కబడ్డాక తగినంత ఉప్పు వేసి దించేస్తే సరిపోతుంది. పాలూ, పనీర్, మసాలా కలిసిన ఈ కశ్మీరీ పనీర్ చమన్ ప్రత్యేక రుచితో ఆకట్టుకుంటుంది. ఇది బలాన్నిచ్చే మంచి పోషకాహారం కూడా. □



# తరచూ సమస్యా?

తరచూ మూత్ర విసర్జన చేయాల్సి వస్తుందా.. కారణం ఎక్కువసేపు మూత్రాన్ని నిలిపి ఉంచడం వల్ల మూత్రనాళంలో బ్యాక్టీరియా చేరి ఇన్ఫెక్షన్‌కు కారణం కావచ్చు. కొన్ని రకాల ఆహార నియమాలుపాటిస్తే అధిగమించవచ్చు.

**దానిమ్మ:** పదే పదే మంటలతో కూడిన మూత్ర విసర్జన అవుతుంటే.. యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్-సి పుష్కలంగా ఉండే దానిమ్మరసం తీసు కోవాలి. దీనివల్ల రోగనిరోధక శక్తి పెరిగి బ్యాక్టీరియా దాడిచేయకుండా కాపాడుతుంది.

**ఉలవలు..** కాల్షియం, యాంటీ ఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉండి ట్యాక్సిన్లను తొలగిస్తాయి. వేయించిన ఉలవలను పొడి చేసి నేరుగా తీసుకున్నా, నీటిలో కలిపి తాగినామేలే. ఇలా రెండు వారాలు చేస్తే ఫలితం ఉంటుంది.

**మెంతులు...** ఇందులోని యాంటీ ఆక్సి డెంట్లు మూత్రపిండాలకు ఎంతో మేలు చేస్తాయి. చెంచా మెంతిపొడిని గ్లాసు గోరువెచ్చని నీటిలో వేసి, దంచిన చిన్నఅల్లం ముక్క చెంచా తేనె కలిపి రోజు రెండుసార్లు తీసుకుంటే ఉపశమనం ఉంటుంది.

**బచ్చలికూర..** ఎక్కువ పోషకాలుండే ఈ కూర మూత్రాశయ సమస్యతో బాధపడుతున్న వారికీ, మూత్రపిండాల ఆరోగ్యానికీ ఎంతో మేలు. ప్రొటీన్లు, ఐరన్, విటమిన్-ఎ మెండుగా ఉండే దీన్ని పావుకప్పు నీటిలో ఐదునిమిషాలు ఉడికించాలి. ఆపై ఆ నీళ్లను వడకట్టి గోరు వెచ్చగా తాగితే మంచిది.

# 'మెగా బంగారం' మూమెంట్..'మా ఇంటి బంగారం' టీమ్



జూన్ 19న విడుదలై బ్లాక్ బస్టర్ సాధించిన 'మా ఇంటి బంగారం' సినిమా నాలుగు రోజుల్లోనే రూ.50 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను వసూలు చేసింది. ఇప్పుడు ఈ సెన్సే షనల్ సక్సెస్‌ను టీమ్ ఎంజాయ్ చేస్తోంది. ఈ క్రమంలో వారికి వారి ఎనర్జీని, ఉత్సాహాన్ని పెంచే సంఘటన జరిగింది... అదే మెగా బంగారం మూమెంట్. సూపర్ డూపర్ హిట్ టాక్‌తో బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్స్ రాబడుతూ దూసుకెళ్తోన్న 'మా ఇంటి బంగారం' ఘన విజయాన్ని అభినందిస్తూ మెగాస్టార్ ట్వీట్ చేశారు. 'మా ఇంటి బంగారం' సినిమాను చూస్తున్నంత సేపు చాలా ఆసక్తికరంగా అని పించింది. జాయింట్ ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్, ఎమోషన్స్‌ని చాలా బాగా మిక్స్ చేస్తూ డైరెక్టర్ నందినీ రెడ్డి తన స్టైల్లో సినిమాను ఎంటర్‌టైనింగ్‌గా రూపొందిం చారు. సమంత నటన గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ముఖ్యంగా ఆమె చీరలో చేసిన యాక్షన్ సీన్స్ చాలా ఆకట్టుకు న్నాయి. ట్వీట్ చేయటంతో పాటు చిత్ర యూనిట్‌ను మెగాస్టార్ చిరంజీవి, ఆయన సతీమణి శ్రీమతి సురేఖ ప్రత్యేకంగా ఇంటికి పిలిచి అభినందించారు. మంచి సినిమాలకు తన వంతు సపోర్ట్‌ను అందించే మెగాస్టార్ 'మా ఇంటి బంగారం' సినిమా టీమ్‌ను అభినందించటం ఎంతో ప్రత్యేకం. సమంత ప్రధాన పాత్రలో నటిస్తూ ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్ మీద రాజ్‌నిడిమోరు, హిమాంక్ దువ్వూరుతో కలిసి ఈ సినిమాను నిర్మించారు. నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. సినిమా తొలి ఆట నుంచే ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ దూసుకెళ్తోంది.

# ఆల్ఫా' ఆటిట్యూడ్‌కు ఒక ప్రతీకలా ఉంటుంది: అలియా భట్..



యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో రాబోతోన్న భారీ బడ్జెట్ చిత్రం'ఆల్ఫా'. ఇండియాలో ఇది వరకెన్నడూ రానట్టుగా అలియా భట్, షర్వారిలతో భారీ బడ్జెట్ యాక్షన్ మూవీని రూపొందిం చారు. ఆల్ఫా చిత్రం ఆటిట్యూడ్‌కు ఒక వేడుకగా, ప్రతీకగా నిలిచే ఓ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. ఈ మూవీ షూటింగ్, అందులోని క్షణాల్ని తాను ఎప్పటికీ మర్చిపోలేను అని అలియా భట్ అన్నారు. అలియా భట్ మాట్లాడుతూ.. ఆల్ఫా'. చిత్రానికి పని చేయడం నాకెంతో ఆనందంగా ఉంది. నేను ఎంజాయ్ చేస్తూ షూటింగ్ చేసిన సినిమాల్లో ఇది కూడా ఒకటిగా నిలుస్తుంది. యాక్షన్, గ్రాండియర్, అడ్వెంచర్‌లతో కూడిన ఈ ప్రపంచంలోకి అడుగు పెట్టడం సంతోషంగా ఉంది. ఇది నేను మునుపెన్నడూ అనుభవించని ఓ కొత్త ఎక్స్‌పీరియెన్స్. షూటింగ్‌లోని ప్రతీ క్షణాన్ని నేను ఎంతో ప్రేమించాను, ఆస్వాధించాను.˜ఈ చిత్రంలోని కథ ఇద్దరు మహిళ కథా నాయికల చుట్టే తిరుగుతుంది. అదే నాకు ఎక్కువగా నచ్చిన అంశం. ఇలాంటి గొప్ప స్క్రిప్టులు మనం అరుదుగా చూస్తుంటాం. ఈ ప్రయాణంలో భాగం అవ్వడం నాకెంతో సంతోషానిచ్చింది.˜ఆల్ఫా అనేది ఆటిట్యూడ్‌కి, సెలెబ్రేషన్‌కి కేరాఫ్‌గా నిలుస్తుంది. ఇలాంటి ఓ అద్భుతమైన బృందంతో కలిసి పని చేయడం నాకు మరింత ప్రత్యేకంగా అనిపించింది. మా దర్శకుడు, నటీనటులు, యాక్షన్ టీమ్, తెర వెనుక సిబ్బంది ఇలా అందరం కలిసి ఎంతో కష్టపడి ఉత్సాహంతో పని చేశాం. మా ఉత్సాహం అంతా కూడా తెరపై ప్రతిబింబిస్తుందని ఆశిస్తున్నాను. ప్రతి ఉదయం సెట్‌కు వెళ్లడానికి మనస్ఫూర్తిగా ఎదురుచూసేదాన్ని, చిత్రీకరణలోని ప్రతి నిమిషాన్ని ఆస్వాదించాను అని అన్నారు. ఆదిత్య చోప్రా నిర్మాణంలో ది రైల్వే మెన్ ఫేమ్ శివ్ రావైల్ దర్శకత్వం వహించిన 'ఆల్ఫా' చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## తెర

# 'సర్దార్ 2' సెప్టెంబర్ 10న రిలీజ్



హీరో కార్తి తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్ హిట్ అయిన˜సర్దార్‌కి సీక్వెల్˜సర్దార్ 2తో ప్రేక్షకులు ముందుకు రానున్నారు. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ సర్దార్2 కి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ గ్రాండ్ గా నిర్మిస్తోంది. తాజాగా చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. ఈ చిత్రం సెప్టెంబర్ 10న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అగ్ని పర్వతంలా ఎగిసిపడుతున్న పేలుడు నేపథ్యంలో, చేతిలో తుపాకీతో ధైర్యంగా నిలబడ్డ హీరో లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. స్టైలిష్‌గా, ఇంటెన్స్‌గా డిజైన్ చేసిన ఈ పోస్టర్ కథలోని యాక్షన్ సూచిస్తూ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని రేకెత్తి స్తోంది. ఈ చిత్రంలో మాళవిక మోహన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ ఫిమేల్ లీడ్స్‌గా నటి స్తుండగా ఎస్ జె సూర్య ఓ పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. సర్దార్ 2 భారీ బడ్జెట్‌తో హ్యూజ్ స్కేల్ లోతెరకెక్క తోంది. ఈ సినిమాకి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తు న్నారు. సామ్ సిఎస్ సంగీతం అందించనున్నారు. జార్జ్ సి విలియమ్స్ ఫోటోగ్రఫీ డైరెక్టర్, దిలీప్ సుబ్బరాయన్ స్టంట్ డైరెక్టర్. రాజీవ్ నంబియార్ ప్రొడక్షన్ డిజైనర్. విజయ్ వేలుకుట్టి ఎడిటర్. తిశ పాల్ పాండి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్.

# 'దీవాన' పాజిటివ్ మౌత్ టాక్ స్ప్రెడ్



'దీవాన' సినిమా క్రియేటివ్‌గా సంతృప్తినిచ్చింది, ఈ వీకెండ్ కు ఆర్థికంగా కూడా సంతృప్తిని ఇస్తుందని నమ్ముతున్నాం ప్రొడ్యూసర్ శ్రీదేవి కార్యంపూడియంగ్ టాలెంటెడ్ హీరో హర్షిత్ రెడ్డి నటించిన కొత్త సినిమా 'దీవాన'. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్‌పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మించారు. ఈ బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో హీరోయిన్ స్నేహ మణిమేగలై, దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి పరిచయయ్యారు. ప్రొడ్యూసర్ శ్రీదేవి కార్యంపూడి మాట్లాడుతూదీవాన సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. సినిమా కథ సెకండాఫ్ నుంచే టేకాఫ్ అవుతుంది. ఇంటర్వెల్, సెకండాఫ్ బాగా ఇంప్రెస్ అయ్యే ఈ మూవీని స్టార్ట్ చేశాం. సరదాగా ఉండే హీరో మారిపోవడం వంటివన్నీ సెకండాఫ్‌లోనే చూపించాం. మేము మూవీ ప్రమోషన్స్, మార్కెటింగ్ లో బిజీగా ఉన్నాం. అదే టైమ్ లో సెన్సార్ నుంచి ఇలా ఇబ్బందులు ఎదురయ్యాయి. మేము రివిజన్ కు వెళ్లే టైమ్ కూడా దొరకలేదు. ఒక విజువల్ కట్ తో పాటు కొన్ని ఆడియో కట్స్ ఇచ్చారు. మా సినిమా చూసిన ఆడియెన్స్ రివ్యూయర్స్ ఇంటర్వెల్ ట్విస్ట్ మాత్రం రివీల్ చేయలేదు. మొదట్లో ఆ ట్విస్ట్ గురించి చెబుతారని కొంత భయం ఉండేది. కొన్ని సినిమాలు కథలోని ట్విస్ట్ మీదే ఆధారపడి ఉంటాయి. ప్రొడ్యూసర్ వాసుదేవ్ కొప్పినేని మాట్లాడుతూ మా మూవీ రిలీజ్‌కు ముందు అన్నీ పక్కాగా ప్లాన్ చేసుకున్నాం. విశాఖ, విజయవాడ, హైదరాబాద్..ఇలా ప్రీమియర్స్ కోసం ఏర్పాట్లు చేశాం. సెన్సార్ అనుకున్న సమయానికి రాకపోవడం వల్ల అనుకున్నవి చేయలేకపోయాం. చిన్న సినిమాకు రిలీజ్ డేట్ మార్చడం ఎంత క్లిష్టమైన పనో మీకు తెలుసు. మా సినిమా యూత్ ఫుల్ మూవీ అనే ఇంప్రెషన్ ఆడియెన్స్ లో మొదట కలిగింది. అయితే మాది హోల్ సమ్ ఫ్యామిలీ మూవీ. ఇందులో లవ్ తో పాటు ఫ్రెండ్షిప్, ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్నాయి. మంచి డెప్త్ ఉన్న డైలాగ్స్ ఉన్నాయి.

# 'పెద్ది' బ్లాక్ బస్టర్ ఈవెంట్



పెద్ది విజయం నా జీవితాన్ని మార్చేసింది. పెద్ది రిలీజ్ అయ్యే వరకు మా పాప క్లీంకార నన్ను నాన్న అని పిలిచేది. విడుదలైన తర్వాత 'పెద్ది' అని పిలుస్తోంది. ఇప్పుడు అందరికీ పెద్ది పేరే గుర్తుంది. పెద్ది ఇంత అందమైన జ్ఞాపకాన్ని ఇచ్చింది: మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది'. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుని రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లతో సంచలన విజయాన్ని సాధించింది. పెద్ది మెగా బ్లాక్‌బస్టర్ ఈవెంట్‌లో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. మా అభిమానుల్లో ఆనాటి నుంచి ఈనాటి వరకు క్రమశిక్షణలో ఎలాంటి మార్పు లేదు. అదే ఉత్సాహం, అదే ప్రేమతో ఆదరిస్తూ వస్తున్న అభిమానులందరికీ నా హృదయపూర్వక అభివాదాలు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ.. ముందుగా నాన్నగారు మెగాస్టార్ చిరంజీవి కి, అనిల్ రావిపూడికి, సాహుకి, ఇక్కడికి విచ్చేసిన పెద్దలందరికీ, అభిమానులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. కొన్ని విజయాలు మనల్ని ఆనందపరుస్తాయి. కొన్ని విజయాల గురించి ఆలోచిస్తే మనసుకు చాలా తృప్తిని ఇస్తాయి. పెద్ది విజయం మాత్రం నా జీవితాన్నే మార్చేసింది. డైరెక్టర్ సుకుమార్ మాట్లాడుతూ.. ముందుగా చిరంజీవికి థాంక్యూ. ఆయన పక్కన కూర్చోవాలన్నా ఇప్పటికీ నాకు టెన్షన్‌గానే ఉంటుంది. చిన్నప్పుడు ఆయన సినిమాలు చూస్తూ పెరిగాం. ఏదైనా సినిమా ఫ్లాప్ అయితే మాకు నిద్ర పట్టేది కాదు. ఆయన మరో సినిమా చేసి హిట్ కొట్టే వరకు ఎదురుచూసేవాళ్లం. అలాంటి చిరంజీవి మాకు రామ్ చరణ్ లాంటి హీరోను ఇచ్చినందుకు థాంక్యూ సో మచ్. నిర్మాత వెంకట సతీష్ కిలారు మాట్లాడుతూ.. . పెద్ది సినిమాను తెలుగు ప్రేక్షకులు తమ భుజాలపై మోసుకుంటూ విజయపథంలో ముందుకు తీసుకెళ్లారు. విడుదలై 19 రోజులు అవుతున్నా ఇప్పటికీ థియేటర్లు ప్రేక్షకులతో కళకళలాడుతున్నాయి. పెద్ది డైరెక్టర్ బుచ్చిబాబు సానా మాట్లాడుతూ.. "నేను పిఠాపురంలో ఉన్న రోజుల్లో చిరంజీవికి లెటర్లు రాసేవాడిని. అయితే ఆయన నుంచి ఎప్పుడూ జవాబు రాలేదు. కానీ నా మొదటి కథ చెప్పే అవకాశం మాత్రం ఆయనకే వచ్చింది. నా రెండో సినిమా పెద్ది కూడా ఆయన వెళ్ళింది. ఒక మనిషికి సంకల్పం ఉంటే ఎంత సాధించగలడో చెప్పే కథే పెద్ది. అలాంటి కథతో ఈరోజు మీ ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది



# 'స్టూడెంట్' ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్

స్వర్గీయ రియల్ స్టార్ శ్రీహరి తనయుడు మేఘాంశ్ శ్రీహరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'స్టూడెంట్'. ఈ సినిమాలో విజేత పరీక్ హీరోయిన్‌గా నటిస్తోంది. జోవికా సినిమాస్, చెరిష్ మీడియా వర్క్స్ బ్యానర్స్ పై బెల్లం సిద్ధారెడ్డి నిర్మిస్తున్నారు. బాలు తత్వమసి దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లం సంగీత, బెల్లం బయ్యారెడ్డి కో ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరిస్తు న్నారు. ఈ రోజు 'స్టూడెంట్' సినిమా నుంచి పవర్ ఫుల్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ లో మేఘాంశ్ శ్రీహరి ఇంటెన్స్ లుక్ లో కనిపిస్తున్నారు. పవర్ స్టార్ సినిమాకు బ్యానర్స్ కట్టడం, జామెట్రీ బాక్స్ లోని డివైడర్ ను క్లాస్ లో కాకుండా ఫైట్స్ కు ఉపయోగిం చడం, కాల్చిన సిగరెట్, అందంగా లవ్ లెటర్స్ రాయడం..ఇలా స్టూడెంట్ లో లైఫ్ లో భాగమైనవన్నీ ఈ పోస్టర్ లో కనిపించి 'స్టూడెంట్' సినిమా మేఘాంశ్ శ్రీహరి కెరీర్ కు ల్యాండ్ మార్క్ మూవీగా రాబోతుందనే అంచనాలు ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ తో ఏర్పడుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.




బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మహిళా కమిషన్ చైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి

# 'సఖి'పై ప్రత్యేక దృష్టి సారిస్తాం

## బాధితులతో ఓపికగా వ్యవహరించాలి

### మహిళా కమిషన్ చైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి

**బేగంపేట, జూన్ 24,ప్రభాతవార్త:** మహిళలకు సంబంధించిన అనేక కేసులు పోలీసులు నమోదు చేయడం లేదని,సఖీ సెంటర్ల పై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహిస్తా మని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి అన్నారు.జాతీయ మహిళా కమిషన్ ,తెలంగాణా రాష్ట్ర మహిళా కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో సఖీ సెంటర్ల సిబ్బంది,పోలీసు, లీగల్ రిప్రజెంటేటివ్‌లకు ఒక రోజు శిక్షణ కార్యక్ర మాన్ని యూసఫ్‌గూడలోని నిమ్స్‌మే మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్ర మాన్ని తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కమిషన్‌కు ఎంతో మంది వస్తున్నారని వారికి ఓపిక, సహనంతో న్యాయం చేసే విధంగా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. మహి ళలకు న్యాయం చేసేందుకు ఏర్పాటు చేసిన సఖీ సెంటర్ల పనితీరు బాగుంటే వారికి దక్కాల్సిన న్యాయం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు కాసోజు శంకరమ్మ, చిట్నాల శ్వేత,శిక్షక యాదవ్ రెడ్డి,సదాలక్ష్మి,రాథాకాని, ఉజ్మా ఆషయ్ షాకీర్, కార్యదర్శి పద్మజ రమణ, రిసోర్స్ పర్సన్స్‌గా హైదరాబాద్ లా కాలేజ్ ప్రిన్సిపాల్ డా.రమాదేవి,నిర్మిమ్,ఉమెన్ సేఫ్టీ వింగ్ ఏసీపీ డి.ప్రసన్నలక్ష్మి,సైకాలజిస్ట్ గీతా చల్లా ,క్లినికల్ సైకాలజిస్ట్ వృషాలి రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

# 'రేషన్' అభ్యర్థనలు తగ్గి.. పెన్షన్ విన్నపాలు పెరిగాయి

### రెండులక్షల పెన్షన్లు మంజూరు
### త్వరలో లబ్ధిదారుల ఎంపిక
### యూరియా సరఫరా బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే
### గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖాముఖి




**హైదరాబాద్, జూన్ 24,ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే కొత్తగా రేషన్ కార్డుల జారీ చేయడంతో ప్రజల నుంచి రేషన్ కార్డుల కోసం ఒక్క అభ్యర్థన కూడా రావడంలేదని ప్రస్తుతం భూసమస్యలు, కొత్త పెన్షన్ల కోసం మాత్రమే విన్నపాలు పెరిగాయనీ రాష్ట్ర రవాణా శాఖ, బీసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని వారి సమ స్యలపై విన్నపాలు స్వీకరించారు. వెంటనే పరి ష్కారం చేసేవి ఆయా బాధ్యులైన అధికారులతో మాట్లాడి పరిష్కారం చేయించారు. మిగితావి ఆయన శాఖలకు సమర్పించి వాటి పరిష్కారంకు శ్రద్ధ తీసుకొంటామని హామీ ఇచ్చారు. అనంతరం గాంధీభవన్‌లో విలేఖరుల సమావేశంలో మా ట్లాడుతూ తెలంగాణా ప్రజా పాలన ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హులై కలిగిన వారందరికి సన్న బియ్యం,200 యూనిట్లు ఉచిత విద్యుత్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గ్యాస్ సబ్సిడీ ఇస్తు న్నామని, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు , నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ళు అందిస్తున్నామని చెప్పారు. కొత్తగా రెండు లక్షల పెన్షన్లు మంజూరు చేశామనీ త్వరలోనే లబ్ధి దారుల ఎంపిక జరుగుతుందనీ తెలిపారు. హైదరాబాద్‌లో కొత్తగా లక్ష ఇళ్ల హైదరాబాద్ లో నిర్మించడానికి ప్రణాళికలు రూపొం దిస్తున్నామనీ తెలిపారు.రాష్ట్రంలో ఏ ప్రజావాణి లో ,ఏ కలెక్టర్ దగ్గర మీ సమస్య పరిష్కారం కాకున్నా గాంధీ భవన్ రండి మీ సమస్యలు మేము పరిష్కారం చేస్తామనీ చెప్పారు.ప్రజా సమస్యల పరిష్కారానికి గాంధీ భవన్ మంత్రు లతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్న టిపిసిసి చీఫ్,ముఖ్యమంత్రికి ధన్యవాదాలని అన్నారు. ఏరువాక పౌర్ణమి జూన్ 29 ఉంటే ఆరోజు నుంచి విత్తనాల సరఫరా ,ఎరు వుల పంపిణీ జరుగుతుందనీ తెలిపారు. యూ రియాపై కృత్రిమంగా ప్రజలకు ఆందోళన చెందేలా కుట్ర జరుగుతుందనీ ఆవేదన చెందారు. భారతదేశంలో రాష్ట్రాలకు ,కేంద్రాలకు వేరు వేరు జాబి తాలు ఉండగా కొన్ని ఉమ్మడి అంశాలు ఉన్నా యనీ ఎరువులకు సంబంధించి తయారీ ఉత్పత్తి సరఫరా కేంద్రంది బాధ్యత అని చెప్పారు. రాష్ట్రానికి సరిపడ మొత్తం యూరియా కేంద్రం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ముడిస రుకు,యూరియా తయారు అంతా కేంద్రం చూసు కుంటుందని అన్నారు.

రాష్ట్రానికి ఎరువులు వచ్చిన రాకపోయినా బిజెపి నాయకత్వంది బాధ్యత అని ఆయన వివరించారు .ముఖ్య మంత్రి, మంత్రులు తెలంగాణ కి అవసరమైన యూరియా సరఫరా చేయాలని అనేక సార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేశామనీ గుర్తుచేశారు. ఎరువుల సరఫరా చేయకపోతే బిజెపి నాయకుల ఇళ్ల ముందు కూర్చుంటామన్నారు. రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం లేదని,మిత్రపక్షంగా లేమని వివక్ష చూ పుతున్నారని ఆరోపించారు.యూరియా ఎరువు లపై కేంద్రంలో ఏ మంత్రిని ఆయినా కలవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎరువుల కేటా యింపులు లేకపోతే బరాబర్ కేంద్రం తో కొట్లాడు తామనీ అన్నారు. కల్తీ విత్తనాలు లేకుండా నాణ్యమైన విత్తనాలు సరఫరా చేస్తున్నామనీ తెలిపారు, దుష్ప్రచారం చేస్తూ ఎరువుల సరఫరా లో రాష్ట్రాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారనీ ఆరోపించారు..రామగుండం ఎరువుల ఉత్పత్తి అయిన దానిని పూర్తి స్థాయిలో తెలంగాణకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



బుధవానం ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య

# అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 24, ప్రభాతవార్త:** నగర శివారు ప్రాంతాలలో చాలా కాలంగా గుడి సెలు వేసుకుని జీవిస్తున్న అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ గుడిసె వాసుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాకు ముఖ్యఅతిధిగా హాజరై ఆర్.కృష్ణయ్య మాట్లా డుతూ ఘటకేసర్ పరిధిలోని కాచువాని సిం గారంలో 1500 మందికి, మోయినాబాద్ మం డలం హిమాయత్ సాగర్‌లో 280 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, కోర్టు కేసులు ఉన్నాయనే కారణం తో ఇంతకాలం పొజిషన్ సర్టిఫికెట్‌లు ఇవ్వలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ స్థలాలపై ఉన్న కోర్టు కేసులు క్లియర్ అయినందున, వారందరికీ పొజి షన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2004 సంవత్స రంలో ఇళ్ల పట్టాలు ఇచ్చి, కోర్టు కేసుల కారణం తో 22 సంవత్సరాలు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా పేద ప్రజలను ఇబ్బం దిపెట్టటం ఏం న్యాయమని ప్రశ్నించారు. ప్రభు త్వం తక్షణమే స్పందించి, గుడిసె వాసులందరికీ న్యాయం చేయాలని, లేనిపక్షం పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గుడిసెవాసుల సంఘం అధ్యక్షులు బాకి రవి, బీసీ సంఘం నాయకులు అనంతయ్య,కట్టమీది శ్రీనివాస్, గోపాల్, మోదీ రాం దేవ్, కరీం, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

# తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలి



### సిఎం రేవంత్‌రెడ్డికి బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్24:** తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డు కుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయో జనాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు బుధవారం బహిరంగ లేఖ రాశారు. కాం గ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కులను పరిరక్షిం చాల్సిన బాధ్యతను విస్మరించి, రాష్ట్ర ప్రయోజనాలను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే ప్రమాదకరమైన విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను తమ రాష్ట్రానికి మళ్లించే ప్రయత్నం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ కు పూర్తి సహకారం అందిస్తున్న మీరు, ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలో కూడా అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తున్నారని విమ ర్శించారు.పాలమూరు బిడ్డనని చెప్పుకునే మీరు, అదే పాలమూరు రైతాంగం భవిష్యత్తును ప్రమా దంలోకి నెట్టడం ఎంత వరకు సమంజసమని లేఖలో ప్రశ్నించారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు కర్ణాటక నుంచి ఎన్‌వోసీ తెస్తున్నాం అనే సాకు చెప్పి, తెలంగాణ జల హక్కులను బేరసా రాల అంశంగా మార్చారా అంటూ ప్రశ్నించారు. తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి (2టిఎంసీ), చిక్కాలపర్వి(2.5టిఎంసీ), చిక్కాల మంచి (5టిఎంసీ) బ్రిడ్జ్-కమ్-బరాజ్‌లకు కాంగ్రెస్ ప్రభుత్వం సమ్మతి తెలిపిందా? లేదా వెల్లడిం చాలని డిమాండ్ చేశారు.2025 జులై 18న కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ఎన్‌వోసీ ఇవ్వడం వెనుక జరిగిన మతలబు ఏమిటి చెప్పాలని కోరారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుంటే మీరు,మీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు.కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోందని ఆరోపించారు.

కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోకపోతే ఆర్డీఎస్‌తో పాటు తుమ్మిళ్ల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని వెల్లడించారు.చివరి దశలో ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తే గ్రావిటీ ద్వారా నారా యణపేట, కొడంగల్‌కు నీళ్ళు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఉద్దేశ్య పూర్వకంగా దాన్ని పక్కన బెట్టారు. కమీషన్ల కోసం కొడంగల్ లిఫ్ట్ పేరిట భీమా ప్రాజెక్టు ఆయకట్టు రైతుల శాశ్వత ప్రయోజనాలను దెబ్బతీశారని విమర్శించారు.తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలు, భవిష్యత్తు నీటి ప్రణాళికలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. తుంగభద్రపై కర్ణాటక చేపడుతున్న అక్రమ ప్రాజెక్టులను తక్షణమే అడ్డుకోవాలని. సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు అధికారిక అభ్యంతరాలు తెలియజేయాలని కోరారు. తుంగభద్ర జలాల వినియోగంలో బచావత్ ట్రిబ్యునల్ విధించిన నిబంధనలను కర్ణాటక తు.చ తప్పకుండా పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరం అయితే కర్ణాటక అక్రమ ప్రాజెక్టులపై సుప్రీం కోర్టులో కేసు వేయాలని, కొడంగల్ లిఫ్ట్ కోసం తెలంగాణ జల హక్కులను బేరసారాల అంశంగా

# తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహోత్సవం బోనాలు

## ఆషాఢ బోనాలు 3 కార్పొరేషన్ల పరిధిలో వైభవంగా నిర్వహిస్తాం

### లండన్ నుంచి జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించిన మంత్రి కొండా సురేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్24:** తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు, సాంస్కృతిక సంప్రదాయాలు, జానపద వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ఆషాఢ మాస బోనాల ఉత్స వాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహిం చేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యా చరణతో ముందుకు సాగుతున్నదని రాష్ట్ర అటవీ, పర్యా వరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రస్తుతం లండన్‌లో పర్యటనలో ఉన్న మంత్రి సురేఖ బుధవారం జూమ్ వేదికగా ఎంసిఆర్ హెచ్ఆర్‌డిలో నిర్వ హించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమా వేశంలో పాల్గొని ఏర్పాట్లపై మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉం దన్నారు. ఈ ఏడాది ఆషాఢ జాతర ఉత్సవాలు జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని దేవాలయాల్లో నిర్వహించే బోనాల ఉత్సవాలకు సౌకర్యాల కల్పనలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బోనాల ఉత్సవాలకు శ్రీకారంచుట్టే గోల్కొండ శ్రీజగదాంబ మహంకాళి దేవాలయం లో జూలై 16న ప్రారంభమయ్యే ఉత్సవాలు ఆగస్టు 13 వరకు అట్టహాసంగా నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా భారీ రద్దీ ఉండే దేవాలయాల వద్ద ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికలు, అదనపు బస్సులు, వైద్య బృందాలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రం నలుమూలల నుంచి తాకిడి వుండే పరిస్థితుల నేపథ్యంలో ఈ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి సురేఖ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు.ఈ ఏడాది బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను కేటాయించినందుకు సీఎంకు మంత్రి సురేఖ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమా వేశంలో ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, దానం నాగేందర్, డిజిపి సి.వి. ఆనంద్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమం తరావు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. సజ్జనార్, ధార్మిక సలహాదారు గోవింద హరి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఒక్క ఎకరాకు నీళ్లు రాలేదు కానీ అప్పుల భారం పెరిగింది

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 24,ప్రభాతవార్త:** కొత్త ప్రాజెక్టుల పేరుతో బిఆర్ఎస్ పాలకులు తొమ్మిదిన్నర ఏళ్ల అధికారంలో ఉండి లక్షల కోట్లు గోదావరిలో పోశా రనీ,ఒక్క ఎకరాకు నీళ్లు రాలేదు కానీ అప్పుల భారం మాత్రం పెంచారనీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ కెటిఆర్ హరీష్ రావుల వాలకం చూస్తుంటే వెన కటి సినిమాల్లో ఉండే "సాఫ్ట్ విలన్స్" గుర్తొస్తు న్నారనీ ఎవరైనా మంచి పని చేస్తుంటే పాడు చేసే రకం వీళ్ళనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రా న్ని అప్పుల ఊబిలోకి నెట్టితే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా సరిదిద్ది పట్టాలెక్కి స్తోందనీ వివరించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు 70 టిఎంసిల అష్యూర్డ్ వాటర్ తెచ్చే ప్రయత్నం చేస్తున్నామనీ ఆయన చెప్పారు. హైద రాబాద్ మెట్రోను మొదలుపెట్టింది కాంగ్రెస్ ప్రభు త్వమే మేము స్టార్ట్ చేస్తే మీరు వచ్చి సగంలో ఆపేశారనీ, తొమ్మిదిన్నర ఏళ్లు అధికా రంలో ఉండి ఫస్ట్ ఫేస్ కూడా పూర్తిగా కట్టలేకపోయారనీ ఎద్దేవా చేశారు.ప్రైవేటులో ఉన్న మెట్రోను ప్రభుత్వ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కేవలం ఐటీ కారిడార్‌కే పరిమితం చేయకుండా అత్యధిక రద్దీ ఉండే ఓల్డ్ సిటీ మీదుగా సామాన్యుడికి ఉపయోగపడేలా లాభ దాయక నిర్వహణ కోసం మెట్రోను రీఅలైన్ చేశా రనీ చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎకనా మిక్ అడ్వైజర్లతో, ఆర్బీఐ గవర్నర్‌తో మాట్లాడి కొత్త ఫైనాన్షియల్ మెకానిజం తెచ్చారనీ గుర్తు చేశారు. మీలాగా 11 శాతం వడ్డీకి కాకుండా ఐఆర్ ఎఫ్సి ద్వారా 4 శాతం కంటే తక్కువ వడ్డీతో నిధులు తెస్తున్నా మనీ అన్నారు. అహ్మదాబాద్, ముంబై మీద చూపిస్తున్న ప్రేమ హైదరాబాద్ మీద కూడా చూపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేరుగా కేంద్రంను డిమాండ్ చేయడంతో కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రులు కలిసి ఫెడరల్ స్ఫూర్తితో చర్చలు జరిపారనీ చెప్పారు. దీనిని కెటిఆర్ ఎందుకు ఓర్వలేకపోతున్నారు?.. ఎల్ అండ్ టీ నుంచి ఆస్తి ప్రభుత్వా నికి బదిలీ అయితే రేవంత్ రెడ్డి కుటుంబానికి ఏం సంబంధం?.. మూసీ ప్రక్షాళనకు ఇంకా డిపిఆర్ కూడా కాకముందే లక్షల కోట్ల అవినీతి అని అబద్ధాలు చెబుతున్నారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు.

# అధికారం పోయినా కెటిఆర్‌కు అహంకారం పోలేదు

### ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

**హైదరాబాద్, జూన్ 24,ప్రభాతవార్త:** కాంగ్రెస్ నేతలు తలుచుకుంటే కెటిఆర్ రోడ్లపై తిరగ లేరనీ, కానీ కాంగ్రెస్ కార్యకర్తలను ఆయన భేద్విరించడం సరికాదనీ ఎమ్మెల్సీ బల్మూరి వెం కట్ హితవు చెప్పారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటే అందుకే బిజెపి నేతలపై బిఆర్ఎస్ నేత లు ఆరోపణలు చేయడం లేదనీ విమర్శించారు. గతంలో చేసిన తప్పుల నుంచి తప్పించుకో వడానికి బిజెపితో బిఆర్ఎస్ నేతల దోస్తీ చేస్తు న్నారని విమర్శించారు. కెటిఆర్ అధికారులను, ప్రజలను బెదిరించడం ఆయన అహంకారానికి నిదర్శనమనీ, సిఎంపై కెటిఆర్, హరీష్ రావు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారనీ ఆవేదన చెందారు.మెట్రో రైలుపై చాలా అబద్ధాలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలపై కావా లనే విషం చిమ్ముతున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం, ప్రైవేట్‌లో ఉన్న మెట్రోను ప్రభుత్వంలోకి తీసుకువచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే బిఆర్ఎస్, బిజెపి నేతలు విమర్శలు చేస్తున్నా రనీ అన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా ప్రభు త్వం కృషి చేస్తోందనీ అన్నారు.కెసిఆర్ పోతే ఆయన సీటు కోసం కెటిఆర్, హరీష్ రావు ఇప్పటి నుం చే కొట్టుకుంటున్నారనీ ఆరోపించారు, బిఆర్ఎస్ నేతలకు దమ్ముంటే అసెంబ్లీ వేదికగా చేసిన ఆరో పణలపై చర్చకు రావాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రతీ సమస్యపై,ప్రతీ పైసాపై చర్చిం చేం దుకు ప్రజాప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# 'సర్'పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

### 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే
### డూప్లికేట్ ఓటర్ల గుర్తింపునకు ఈఆర్‌వో నెట్ ద్వారా ప్రత్యేక పరిశీలన: కలెక్టర్ టిఎస్ దివాకర



**ఖమ్మం, జూన్ 24, ప్రభాతవార్త:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై మీడియా ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి జిల్లా కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహిం చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లా డుతూ ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు విజయవంతంగా పూర్తయ్యా యని తెలిపారు. బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వోలు) శిక్షణలు నిర్వహించడంతో పాటు అవస రమైన పత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.జూన్ 25, 2026 నుంచి జూలై 24, 2026 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వ హించి ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారంలు రెండు అందజేస్తారని తెలిపారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం నింపి తిరిగి ఒక ఫారం బీఎల్‌వోలకు అందజేయాలని సూ చించారు. ప్రతి ఇంటిని బీఎల్‌వోలు మూడు సార్లు సందర్శిస్తారని తెలిపారు.ఎస్ఐఆర్ కార్యక్ర మంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేం దుకు మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఓటర్లు ఇంటి వద్ద అందుబాటులో ఉండి వివరాలను సక్రమంగా అందించాలని విజ్ఞప్తి చేశారు. జూలై 31న ముసాయిదా ఎస్ఐఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని, ఓటరు పేరు లేకపోవడం లేదా ఇతర అభ్యంతరాలపై ఆగస్టు 30, 2026 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అందిన అన్ని అభ్యంతరాలను సెప్టెం బర్ 28, 2026 నాటికి పరిష్కరించి అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని వెల్లడించారు.

అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి వివిధ మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమగ్రంగా సమాధానాలు ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అన్సారీ, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మహావృక్షాల్లా ఎదగాలి

### లోక్‌భవన్ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ చేసిన గవర్నర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్24:** ప్రతి విద్యార్థి ఒక చిన్న మొక్కలాంటివాడని, దానిని ప్రేమతో సంరక్షి స్తే మహావృక్షంగా ఎదిగినట్లే విద్యార్థులను కూడా విద్య, క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో తీర్చిదిద్దితే గొప్ప వ్యక్తులుగా ఎదుగుతారని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. విద్యార్థుల భవిష్యత్తే దేశ భవిష్య త్తని, తాము ఎంచుకున్న రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకొని కుటుంబానికి, గ్రామానికి, దేశా నికి మంచి పేరు తీసుకురావాలని గవర్నర్ విద్యా ర్థులకు సూచించారు.భారత్ సేవాశ్రమ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం లోక్‌భవన్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఉచిత నోట్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. అంతకు ముందు లోక్‌భవన్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ మొక్కకు ప్రతిరోజూ నీరు పోసి, బయటి ప్రతికూల పరిస్థితుల నుంచి రక్షి స్తే అది మహావృక్షంగా మారుతుందని, అదే విధంగా విద్యార్థులను కూడా మాదకద్రవ్యాలు, సోషల్ మీడియా దుష్ప్రభావాల నుంచి దూరంగా ఉంచి నాణ్యమైన విద్యతో తీర్చిదిద్దాలని ఉపాధ్యా యులకు సూచించారు. లోక్ భవన్ పాఠశాల కేవలం విద్యాసంస్థ మాత్రమే కాదని, సమాజం లోని వెనుకబడిన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లోక్ భవన్ సంకల్పానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. భారత్ సేవాశ్రమ సం ఘ్ సేవ, కరుణ, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తోందని గవర్నర్ కొనియాడారు. మానవ సేవయే మాధవ సేవ అనే సంఘ్ ఆదర్శం సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. విపత్తు సహాయం,ఆరోగ్య సేవలు, విద్యారంగాల్లో సంఘ్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొ న్నారు. ఇటీవల ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన యంగ్ ఇండియా విద్యార్థి కిట్ల పంపిణీ కార్యక్ర మంలో పాల్గొన్నానని గుర్తు చేశారు. వేలాది మంది విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం, సంకల్పం కనిపించిందన్నారు. అదే వేదికపై విద్యార్థులతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిం చినట్లు తెలిపారు. తెలంగాణను దేశంలోనే విద్య, క్రీడల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. పంపిణీ చేస్తున్న నోట్‌బుక్‌లు కేవలం కాగితాల కట్టలు కాదని, విద్యార్థుల కలలు, ఆత్మవిశ్వాసం, ఉజ్వల భవిష్యత్తుకు పునాదులని పేర్కొన్నారు. కేవలం 14 ఏళ్ల వయసులోనే ప్రపంచ క్రికెట్‌లో తన ప్రతిభను చాటుకున్న యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీని విద్యార్థులు ఆదర్శంగా తీసుకో వాలని గవర్నర్ సూచించారు. కార్యక్రమంలో గవ ర్నర్ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఎం. దాన కిషోర్, సంయుక్త కార్యదర్శిశశికిరణాచారి, భారత్ సేవా శ్రమ సంఘ్ స్వామి మున్నేశ్వరానంద, స్వామి వెంకటేశ్వరానందజీ, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, లోక్ భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సం

# రూ.1000 కోట్ల స్కామ్ చేసిన సర్కార్

## త్వరలోనే మరొకటి బయటపెడతాం: జగదీశ్‌రెడ్డి

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సిఎంకు పిఎగా పని చేస్తున్నారా?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్24:** హైబ్రిడ్ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను తుం గలో తొక్కిందని, స్కీములు లేవు కానీ రోజుకో స్కాం వెలుగు చూస్తోం దని బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. పీఎం కుసుమ్ పథకంలో కూడా రూ.వెయ్యి కోట్ల కుం భకోణానికి తెరతీశారని, విద్యుత్ శాఖలో మరో స్కాంను త్వరలోనే బయటపెడతా మన్నారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.

రాష్ట్రంలో ప్రస్తుతం సాగుతున్న పాలనపై, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న సంబంధాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అందిం చాల్సిన సంక్షేమ పథకాలను పక్కనపెట్టిందని జగదీష్ రెడ్డి ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో స్కామ్‌లు తప్ప స్కీమ్‌లు లేవని విమర్శించారు. ఈ ఆరోపణలపై రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాలపై స్పందించిన జగదీష్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ పదవికి ఎసరు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులకు సంబంధించి బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటేనని కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని జగదీష్ రెడ్డి ఖండించారు.

సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తూ.. నేషనల్ బ్యాంకులను భయపెడుతు న్నారని జగదీష్ రెడ్డి ఆరోపించారు. రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేసినందుకే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వయంగా మిగిలిన కేంద్రమంత్రులతో సమా వేశాలు ఏర్పాటు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఇది చూస్తే సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పీఏ లాగా పని చేస్తున్నారా అనే అనుమానం కలుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# సద్దుమణిగిన కామారెడ్డి క్రమశిక్షణరాహిత్యం

### కాంగ్రెస్ సంస్థాగత అభివృద్ధికి కృషిచేస్తామన్న ఇరువర్గాలు

**హైదరాబాద్, జూన్24,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత షబ్బీర్ అలీ,పిసిసి జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి,కామారెడ్డి మాజీ మున్సి పల్ చైర్మన్ ఇందుప్రియల క్రమశిక్షణరాహిత్యం వైఖరితో ఏర్పడిన వివాదం ఎట్టకేలకు తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ జోక్యంతో సద్దుమ ణిగింది. క్రమశిక్షణకమిటీ చైర్మన్ మల్లు రవి, వైస్ చైర్మన్ ఎశ్యాం మోహన్‌లు కామారెడ్డి వివా దం సమసిపోయిందని ఇరువర్గాలు కలిసి కాం గ్రెస్ సంస్థాగత అభివృద్ధికి పనిచేస్తామని ఒప్పు కొన్నారని ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీచీఫ్ బొమ్మమహేశ్ కుమా ర్‌గౌడ్‌తోపాటు మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేసి నట్లు సామాజిక మాధ్యమాలలో ఒక ఆడియో చక్కార్లుకొట్టింది. అదే సమయంలో సొంతపార్టీ నేతలపై విమర్శలు, దుష్ప్రచారం జరుగుతోం దని ఆరోపిస్తూ మాజీమున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డంఇందుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు భూసేకరణ వేగవంతం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరా బాద్, జూన్ 24:** రాష్ట్రంలోని ప్రతిష్టాత్మకమైన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలక ముం దడుగు పడింది. ఈ పథకం లో భాగంగా నిర్మించనున్న లక్ష్మీదేవిపల్లి బ్యాలన్సింగ్ రిజర్వాయర్‌కు అవసరమైన భూసేకరణ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. సయ్యద్‌పల్లి పరిసర ప్రాంతాల్లో భూములను పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి భూసే కరణ, సర్వే ప్రక్రియ, ముంపు ప్రాంతాల గుర్తిం పు తదితర అంశాలపై ప్రజాప్ర తినిధులు సమీక్ష నిర్వహించారు.లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మా ణం కోసం దాదాపు 2,919 ఎకరాల భూమి అవసరమవుతుందని అధికా రులు తెల్పారు. ఈ మేరకు భూసేకరణ పనులను వేగవంతం చేసేం దుకు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ముమ్మరంగా కసరత్తు చేయనున్నారు. 2.80 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించనున్న లక్ష్మీదేవిపల్లి బ్యాలన్సింగ్ రిజర్వాయర్, పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కీలక భాగంగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే దక్షిణ తెలంగాణలోని దాదాపు 4.97 లక్షల హెక్టార్ల భూములకు సాగునీరు అందనుంది. సాగునీటితో పాటు ఈ ప్రాంతంలో నెలకొన్న తాగునీటి సమస్యకు

25CTR 6:25CTR 6.qxd 6/24/2026 11:32 PM Page 1



# తిరుపతి డివిజన్

## ఎరువుల దుకాణంపై అధికారుల దాడి

### షోకాజ్ నోటీసులు.. 10 రోజుల పాటు లైసెన్స్ సస్పెండ్



తొట్టంబేడు జూన్ 24 ప్రభాతవార్త

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి రైతులకు నిర్ణీత ధర కంటే అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తున్న శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ఫెర్టిలైజర్ దుకాణంపై వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పట్టణంలోని నంది సర్కిల్ సమీపంలోనిఫెర్టిలైజర్ షాపులో ఎమ్ఆర్‌పి కంటే ఎక్కువ రేట్లకు ఎరువుల బస్తాలు అమ్ముతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో అగ్రికల్చర్ ఏడీఏ రమేష్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఎన్.సురేంద్రరెడ్డి సిబ్బందితో కలిసి సదరు దుకాణంలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు ఆధారాలతో సహా నిర్ధారణ అయింది. వెంటనే స్పందించిన అధికారులు దుకాణదారుడికి షోకాజ్ నోటీసుజారీ చేసి, 10 రోజుల పాటు లైసెన్స్ సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు శాశ్వతంగా రద్దు చేసి క్రిమినల్ కేసులు పెడతాం" అని హెచ్చరించారు. అధికారుల ఆకస్మిక తనిఖీలతో పట్టణంలోని ఇతర ఎరువుల వ్యాపారుల్లో కలకలం రేగింది.

## ఎంఎం వాడలో రూ.30లక్షలతో కాలువలు,రోడ్లు

### భూమి పూజ చేసిన కమిషనర్

శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో మురుగునీటి కాలువలు, రోడ్లకు మంచి రోజులు వస్తున్నాయి. తుడా సారధ్యంలో రూ.1.5కోట్లతో కాలువలు, రోడ్లు పనులు జరుగుతుండగా బుధవారం ఎంఎం వాడ ప్రజల సౌకర్యార్థం రూ.30లక్షలతో సిసి రోడ్డు డ్రైనేజ్ కాలువ పనులకు కమిషనర్ కెవి కృష్ణారెడ్డిభూమి పూజలు జరిపారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటిని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుటకు ఉన్న నిధులతో పనులు చేపడుతున్నట్లు వివరించారు. ప్రాధాన్యత క్రమంలో స్థానిక శాసనసభ్యులు బొజ్జల సుధీర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి భానుప్రకాష్‌రెడ్డి ఆదేశాలతో ఎంఎల వాడలో మౌళిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టామన్నారు. దశల వారిగా వాడలను అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అన్నారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటికి సమీపంలోని ఎంఎం వాడలో గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధి పనులు జరగలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మొదటి దశగా ఇక్కడ డ్రైనేజ్,రోడ్లు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ కెవి కృష్ణారెడ్డి మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం స్థానిక సంస్థలు మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అన్ని వార్డుల్లో పరిస్థితిని గమనించి గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. వర్షాకాలంలో ఎదురయ్యే సమస్య డ్రైనేజ్‌లు లేకపోవటంతో వర్షపు నీరు ఇళ్ళలో జొరబడుతుందన్నారు. పనులతో పాటు నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. పనులు తతీసుకున్న కాంట్రాక్టర్లు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ భూమి పూజ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ కెవి కృష్ణారెడ్డితో పాటు మున్సిపల్ డిఇఇ రవిప్రకాష్, యశస్విని, వార్డుకు చెందిన గోపినాథ్, మాజీ కౌన్సిలర్ రవీంద్రబాబు, తెలుగుదేశం యువ నాయకుడు లక్కనమేని మధునాయుడు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో మహిళా కమిషన్ చైర్మెన్

శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతిగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని బుధవారం ఆంధ్ర ప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్;ఇఒ బికె వెంకటేశుల ఆదేశాలతో ప్రోటోకాల్ ఎఇఒ లోకేష్, ఎపిఆర్ఒ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఆమె ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. ఆలయంలో పరిపాలన అలాగే మహిళా రిజర్వేషన్ అమలు తదితర అంశాలను కమిషన్ చైర్‌పర్సన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయ నిర్వహణ చక్కగా ఉందని అభినందించారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద ఆమెకు వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లును ఆలయ చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్, సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, లైజనింగ్ అధికారి శాంతి దుర్గ, ఆలయ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి,, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యం, ఎపిఆర్ఓలు దుర్గాప్రసాద్, రవిలు పర్యవేక్షించారు.

## శ్రీకాళహస్తిలో పీర్లపండగ సంబరాలు

శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని కొన్ని ప్రాంతాల్లో పీర్లపండను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని పాల నెల్లూరు బస్టాండు, దర్గా మిట్టలో పీర్లపండగను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పీర్లపండగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహాకరించుటకు పట్టణ సిఐ నాగరాజు శాంతి కమిటిని ఏర్పాటు చేసారు. ఎలాంటి సంఘట నలు గొడవలు జరగకుండా చూడాలని సూచించారు. కాగా మంగళ వారం రాత్రి కన్నుల పండువగా దర్గా దగ్గర పీర్లను చుట్టుపక్కల వీధుల్లో ఊరేగింపు జరిపారు. ఈ కార్యక్రమాల్లో దర్గా కమిటి నిర్వాహాకులు సయ్యాద్ అహమ్మద్ బాబా పరీద్, జహంగీర్, షాహీ, గుమ్మళ్ళ రాజేశ్వరరావుగరికపాటి రమేష్‌బాబు, జమృద్‌బాషాలు పాల్గొన్నారు. కాగా బుధవారం అగ్నిగుండ ప్రవేశం నిర్వహంచారు. ఈ నెల 26న నెల్లూరులో రొట్టెల పండుగతో పాటు స్థానికంగా స్వర్ణముఖి నదిలో కూడా రొట్టెల పండగ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు.

## పిల్లలను బడికి పంపండి, డ్రాపౌట్స్ అరికట్టండి



శ్రీకాళహస్తి రూరల్, జూన్ 23 ప్రభాతవార్త

ఎంఆర్‌పియస్ నాయకుడు మంద కృష్ణ మాదిగ సూచనలతో స్థానిక నాయకుడు 'గో టు విలేజ్' కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డి కండ్రిగ గ్రామంలో సమావేశం నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి ఈర్ల రాజా మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తిరుపతి జిల్లా ఇంచార్జి వర్ల దేవదాసు మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్ల దేవదాసు మాదిగ మాట్లాడుతూ "గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క విద్యార్థిని, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లే విధంగా తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించి బడికి పంపించాలన్నారు. పిల్లలు డ్రాపౌట్ కాకుండా చూసి బాగా చదివించాలి" అని పిలుపునిచ్చారు. అలాగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నాటికి శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాల్లో జెండా ఆవిష్కరణ జరిగేలా కమిటీలు చర్యలు తీసుకోవాలని సూచించారు. మిగిలిపోయిన కమిటీల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో శ్రీకాళహస్తి మండల ఇంచార్జిగా యువరాజ్ మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అజయ్ మాదిగ, వెంకటయ్య మాదిగతో పాటు గ్రామ మాదిగ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## పుణ్యక్షేత్రం అభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా నిర్ణయాలు

### తిరిగి ఇవ్వటానికి సన్నాహాలు : కమిషనర్ కెవి కృష్ణారెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం అభివృద్ధికి నిధుల అందుబాటులో ఉన్నమేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మున్సిపల్‌కమిషనర్ కెవి కృష్ణారెడ్డి బుధవారం ప్రభాతవార్తకు తెలిపారు. శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.200కోట్లతో ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం కాబట్టి ఇక్కడ చక్కగా ప్రణాళిక లు రూపొందిస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ళకు సొమ్ములు చెల్లించి రద్దు చేసిన వారికి సొమ్ములు తిరిగి ఇవ్వటానికి సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం టిడ్కో ఇళ్ళనుపూర్తి చేసి లబ్ధిదారులకు అందించారని సొమ్ములు వాపసు చేయటానికి రూ.4కోట్లు నిధులు మంజూరు చేసిందని వాటిని ఒకటి రెండు రోజుల్లో తిరిగి ఇవ్వనున్నట్లు కమిషనర్ కృష్ణారెడ్డి వివరించారు. మిగిలిన ఇళ్లను కూడా పూర్తి చేయటానికి కాంట్రాక్టర్‌ను సంప్రదించనున్నట్లు వివరించారు. పట్టణంలో కాలువలు, రోడ్ల అబివృద్ధికి తుడా నిధులు మంజూరు చేసిందని వివరించారు



**పారిశుద్ధ్యం, లైటింగ్‌కు ప్రాధాన్యత:** శ్రీకాళహస్తి మున్సిపాలిటి సుమారు 30కిలో మీటర్లు ఉందని అయితే పారిశుద్ధ్యంకు సంబంధించి కార్మికుల కొరత ఉందన్నారు. ఉన్నంతలో పారిశుద్ధ్యంకు సంబంధించి పరుగులు తీయిస్తున్నామన్నారు. నాలుగుమాడావీధుల్లో పారిశుద్ధ్యం భేష్‌గా ఉందన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యను వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. అలాగే ఆలయానికి వచ్చేభక్తులకు మున్సిపాలిటి సకల సదుపాయాలు కల్పించుటకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇక లైటింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. అయితే సమస్య తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలను పరిపాలనలో భాగస్వాముల్ని చేయటానికి ప్రతి సోమవారం 'ప్రజావేదికను' ప్రారంభించామన్నారు. మున్సిపాలిటికి రావాల్సిన పన్నులను ప్రజలు సకాలంలో చెల్లించాలన్నారు. శ్రీకాళహస్తి దేవస్థానం షాపింగ్‌కాంప్లేక్సులు స్కిట్ కళాశాలలకు సంబంధించిన పన్నులు రూ.5.6కోట్లు పార్కింగ్‌కు సంబంధించి రూ.3కోట్లు రావాల్సి ఉందన్నారు. ఈ అంశానికి సంబంధించి దేవస్థానం ఇఒ తో కలసి చర్చించామన్నారు.

## విద్యుత్ బస్సులను ప్రైవేటుకు ఇవ్వొద్దు

### ఎర్ర బ్యాడ్జీలతో ఉద్యోగుల ధర్నా




..శ్రీకాళహస్తి, జూన్ 23 ప్రభాతవార్త

ఏపీఎస్ఆర్టీసీ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శ్రీకాళహస్తి డిపోలో ఉద్యోగులు బుధవారం నిరసన చేపట్టారు. ఉద్యోగులంతా ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. డిపో గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రాష్ట్ర నాయకులు బీఎస్. బాబు, మురగమ్మ, శేషు, మధు పాల్గొని ప్రసంగించారు. విద్యుత్ బస్సులను ప్రైవేట్ ఆపరేటర్లకు కట్టబెట్టే ప్రభుత్వ ఆలోచనను వారు తీవ్రంగా వ్యతిరేకించారు. "విద్యుత్ బస్సులను ప్రభుత్వం లేదా ఆర్టీసీయే కొనుగోలు చేసి నిర్వహించాలని, ప్రైవేటుకు ఇస్తే కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌ల ఉద్యోగాలు పోతాయి" అని నాయకులు హెచ్చరించారు. జేఏసీ ప్రధాన డిమాండ్లు..: ప్రస్తుత ఈ హెచ్ ఎస్ విధానాన్ని రద్దుచేసి పాత విధానం అమలు చేయాలని, ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. స్త్రీ శక్తి పథకం అమలై 10 నెలలైనా ఒక్క కొత్త బస్సు కూడా రాలేదని, ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తక్షణమే కొత్త బస్సులు కొనాలని డిమాండ్ చేశారు. కాలం చెల్లిన టిమ్ మిషన్ల వల్ల సిబ్బంది మానసిక వేదనకు గురవుతున్నారని, కొత్త మిషన్లు ఇవ్వాలన్నారు. అలాగే విద్యుత్ బస్సుల కోసం డిపోలను ఖాళీ చేయించొద్దని, ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటుకు కట్టబెట్టొద్దని, 01/2019 సర్కులర్‌ను అన్ని డిపోల్లో అమలు చేయాలని, సిబ్బందిపై దాడులను అరికట్టాలని, 11వ పి ఆర్ సి, పెండింగ్ డి ఎ, టి ఎ అరియర్స్ వెంటనే చెల్లించాలని జేఏసీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో డిపో నాయకులు వీపీ. రావు, వై.డి. కుమార్, జి. శివకుమార్, టి. లింగమూర్తి, జీపీఎస్. ఆచారి, సాధిక్, పీఆర్. బాబు, ఎస్. కుప్పయ్య, వేంకటాద్రి, పీఎస్. ఖాన్, పి. పట్టాభి, గ్యారేజ్ నాయకులు పీసీ. కృష్ణ, మురళి, శ్రీధర్‌తో ఉద్యోగులు పాల్గొన్నారు.

## తొట్టంబేడు విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

తొట్టంబేడు, జూన్ 24 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలం తొట్టంబేడు పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఉచిత యూనిఫాం పంపిణీ కార్యక్రమం జరిగింది. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తొట్టంబేటి అయ్యప్ప చే విద్యార్థులకు యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యార్థులంతా క్రమశిక్షణతో మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. తల్లిదండ్రుల కలలను నిజం చేస్తూ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలి" అని ఆకాంక్షించారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు యూనిఫాం, పుస్తకాలు అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ఉపాధ్యక్షుడు భీమాల చందు ప్రధానోపాధ్యాయుడు మోహన్ బాబు, ఉపాధ్యాయులు ముని ప్రసాద్, హేమ భూషణ్ వి ద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పూడి యువతకు భరత్ యువసేన వాలీబాల్ కిట్ పంపిణీ..



తొట్టంబేడు, జూన్ 25 ప్రభాతవార్త

గ్రామీణ యువత క్రీడల్లోనూ, చదువుల్లోనూ ముందంజలో ఉండాలని, తప్పుడు మార్గాల వైపు వెళ్లకుండా క్రీడల వైపు మళ్లించేందుకే ఈ ప్రోత్సాహక కార్యక్రమాలు చేపడుతున్నట్లు భరత్ యువసేన సభ్యులు తెలిపారు. తొట్టంబేడు మండలం పూడి గ్రామ యువతకు భరత్ యువసేన ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భరత్ యువసేన ప్రతినిధులు మాట్లాడుతూ, యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. పూడి గ్రామంలోని జానపద కళాకారులు, యువత, క్రీడాకారులకు క్రీడా సామాగ్రి, విద్యార్థులకు విద్యా సామాగ్రి పలుమార్లు పంపిణీ చేసినట్లు వివరించారు.

## అర్హులైన ఓటర్ల ఓట్లు ఉండేటట్లు చూడండి

శ్రీకాళహస్తి జూన్ 23 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వ ర్యంలో బుధవారం ఎస్ ఐ ఆర్ పై నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశం నిర్వవిాంచారు., భవిష్యత్తు కార్యాచరణ పై ప్రణాళికలు సిద్ధం చేసు కున్నారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ సర్ కార్యక్రమం రూపొందింపబడిందంటే అది లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారి పోరాట ఫలితమేనని కానీ నేడు జరుగుతున్నటువంటి సర్ పై ప్రజలకు చాలా అనుమానాలు ఉన్నాయని, చాలామందికి సంవత్స రాలుగా ఓటు ఉన్నా, నేడు కొన్ని చోట్ల పేర్లు కనిపించడం లేదని సమాచారం వస్తోందన్నారు. ముఖ్యంగా 2002 నుంచి ఓటు ఉన్నవాళ్లు కూడా తమ ఓటు చెక్ చేసుకోవాలని ఆయన కోరారు. అదే విధముగా తమ కుటుంబ సభ్యుల ఓట్లు కూడా పరిశీలించాలన్నారు ఏదైనా సమస్య ఉంటే వెంటనే తెలియజేయాలనీ కోరారు. ఒకవేళ ఓటు కనిపించకపోతే భయపడాల్సిన అవసరం లేదని తలపా దామోదర్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. అలాంటి వారికోసం బి ఎల్ ఏ లను అదే విధముగా సంబంధిత అధికారులను సంప్రదించి ప్రజలు ఎవరూ ఆందోళన చెందకుండా వారి ఓటు హక్కును కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రజలతో ఉంటుందనీ ఆయన తెలిపారు. సర్ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, ఓట్ల గల్లంతకు అవకాశం ఉందని ఓట్లు గల్లంత కాకుండా ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త నడుం బిగించినాయకుడు రాహుల్ గాంధీ యొక్క ఆశయాలను ప్రజల్లోకి తీసుకుని పోయే విధంగా ప్రజలను చైతన్యపరిచి రాజ్యాంగబద్ధమైనటువంటి ఓటు హక్కును కోల్పోకుండా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ కరిముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, శంకర్, మాస్, చరణ్, సారథి, నిజాముద్దీన్, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖచ్చితమైన ఓటరు జాబితానే లక్ష్యం

### జనసేన నేత నరేంద్ర దండి

శ్రీకాళహస్తి, జూన్ 23 ప్రభాతవార్త



స్వచ్ఛమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా నిర్మాణమే తమ లక్ష్యమని జనసేన పార్టీ శ్రీకాళహస్తి నాయకుడు నరేంద్ర దండి స్పష్టం చేశారు. బుధవారం శ్రీకాళహస్తి మండల రెవెన్యూ అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి సర్ కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్ అమలు విధానం, ఓటరు జాబితా నాణ్యత, బి ఎల్ ఓ బి ఎల్ ఏ మధ్య సమ న్వయం వంటి కీలక అంశాలపై వివరంగా చర్చ జరిగిందని నరేంద్ర దండి అన్నారు. జనసేన పార్టీ తరఫున పనిచేస్తున్న బి ఎల్ ఎ ల పరిశీలనలు, సూచనలు, నిర్మాణాత్మక అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఆయన అన్నారు. ఈ రెండింటి మధ్య ఎటువంటి సమాచార లోపాలు లేకుండా సమన్వయం మెరుగుపడేలా శ్రీకాళహస్తి రూరల్ బి ఎల్ ఏ జాబితాను ఎమ్మార్వోకి మరోసారి అందజేసినట్లు నరేంద్ర దండి తెలిపారు. జనసేన సూచనలను ఎమ్మార్వో సానుకూలంగా స్వీకరించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి జనసేన నాయకులు లక్ష్మణ్, నవీన్, సుబ్బు, జయశంకర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

తడ, జూన్ 23 ప్రభాతవార్త



..కారూరు పంచాయతీలో వెలసి ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం కుంబాభిషేకం మహోత్సవంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు పొందారు ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులను గ్రామ పెద్దలను ఎమ్మెల్యే అభినందించారు. ఇదే తరహాలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడంతోపాటు సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీని స్థానిక నేతలు నీలకంఠం, జీవ, ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సెల్వం, పళనీ, లాయర్ సుదర్శన్, టికే శ్రీనివాసన్, శ్యామ్ సుందర్ రెడ్డి, సుధాకర్, మునేంద్రయ్య, స్వామినాథన్ స్థానిక నాయకులు పాల్గొన్నారు...

## కెఎస్ఆర్‌ను పరామర్శించిన పలువురు వైసీపీ నేతలు



పెళ్లకూరు, జూన్ 24, ప్రభాతవార్త: వైఎస్ఆర్‌సిపి నాయకులు మాజీ ఎన్‌డిసిసిబి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డిని వైఎస్ఆర్సిపి పార్టీకి చెందిన సూళ్లూరుపేట నియోజకవర్గ పరిశీలకులు బి.శ్రీకాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ మేరుగ. మురళి బుధవారం చిల్లకూరులోని కేఎస్ఆర్ నివాసంలో ఆయనను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడి న్యాయం కోసం పోరాడే నాయకులపై అక్రమ కేసులు బనాయించి అక్రమంగా జైల్లో పెడుతూ కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ప్రజాస్వామ్యంలో ఇది ఏ మాత్రం మంచిది కాదని హితవు పలికారు. సత్యనారాయణ రెడ్డి పై అక్రమ కేసులు బనాయించి ఆయనను మానసికంగా కృంగదీయాలని ప్రయత్నిస్తే వాటన్నింటికీ ఆయన భయపడే మనిషి కాదని పడి లేచిన కెరటంలా ఉవ్వెత్తున ఎగిసి పడే మనిషి అని కూటమి ప్రభుత్వం ఈ కుట్రపూరిత ప్రయత్నాలను మానుకోవాలని లేనిపక్షంలో రాబోయే వైసీపీ ప్రభుత్వంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు అన్నారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుక గ్రావెల్‌ను అడ్డుకుని ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు బనాయించి జైలు పాలు చేస్తూ కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్సీపీ నాయకులు రవి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

## సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

శ్రీకాళహస్తి జూన్ 23




ప్రభాతవార్త

సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం శ్రీకాళహస్తి పట్టణంలోని సివిల్ గోదాం వద్ద మెరుపు సమ్మె నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు అయ్యప్ప, గౌరవాధ్యక్షులు జనమాల గురవయ్య మాట్లాడుతూ హమాలీ కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా శ్రమిస్తూ సివిల్ సప్లై వ్యవస్థ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు రావాల్సిన మంత్లీ చార్జీలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, సిపిఐ రూరల్ కార్యదర్శి మించాల శివకుమార్, ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు, మేస్త్రి గిరి, రామ్మూర్తి, బాబురాజు, రుక్కేష్, సాంబశివ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## యాక్ట్ ఫైబర్ నెట్ బ్రాంచ్ ప్రారంభం

శ్రీకాళహస్తి జూన్ 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలో తారకరామా డిస్ట్రిబ్యూటర్స్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన యాక్ట్ ఫైబర్ నెట్ బ్రాంచ్ కార్యాలయాన్ని శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సోమవారం ప్రారంభించారు. పట్టణంలోని నాయుడు బిల్డింగ్స్, మెయిన్ రోడ్ నందు ఏర్పాటు చేసిన ఈ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతికతతో కూడిన యాక్ట్ ఫైబర్ నెట్ సేవలు ఇకపై శ్రీకాళహస్తి ప్రజలకు మరింత చేరువలో లభిస్తాయని తెలిపారు. హైస్పీడ్ ఇంటర్నెట్, అన్‌లిమిటెడ్ డేటా ప్లాన్‌లతో విద్యార్థులు, వ్యాపారులు, గృహ వినియోగదారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కస్టమర్లకు 24/7 సేవలు, త్వరితగతిన ఇన్‌స్టాలేషన్, అత్యుత్తమ కస్టమర్ సపోర్ట్ అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల ప్రజలు కొత్త కనెక్షన్ల కోసం నేరుగా బ్రాంచ్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి హాజరై ఆశీర్వదించారు. తారకరామా డిస్ట్రిబ్యూటర్స్ సిబ్బంది, యాక్ట్ ఫైబర్ నెట్ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఆర్య వర్క్‌పై మహిళలకు ఉచిత శిక్షణ ప్రారంభం




తిరుపతి కలెక్టరేట్, జూన్ 24 ప్రభాతవార్త : రాస్ జన శిక్షణ సంస్థాన్, తిరుపతి వారి ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ మండలం మంగళం నందు మహిళలకు మగ్గం వర్క్ (ఆర్య వర్క్) పై మూడు నెలల ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాస్ డైరెక్టర్ వి.నాగరాజు , జన శిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్ బి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో వి.నాగరాజు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే చేతివృత్తులు నేర్చుకుని అభివృద్ధి చెందాలని తెలియజేశారు. నేటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కుటుంబంలో ప్రతి ఒక్కరూ పనిచేస్తూ ముందుకు సాగాలని తెలిపారు. అంతే కాకుండా జన శిక్షణ సంస్థాన్ నిర్వహించే వివిధ రకాల చేతి వృత్తుల పై శిక్షణ తీసుకోవాలని కోరారు. తరువాత బి. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ చేతివృత్తులతోపాటు ప్రతి మహిళ పొదుపు సంఘాల్లో చేరి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని. అలాగే రాస్ నిర్వహించే వివిధ కార్యక్రమాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్య వర్క్ నేర్చుకోవడానికి వచ్చినటువంటి మహిళలందరికీ ఉచితంగా ముడి సరుకుని అందించారు. ఈ కార్యక్రమంలో రాస్ ఫీల్డ్ ఆఫీసర్ డి. నాగరాజు గారు,శ్రీదేవి ,క్లస్టర్ లీడర్లు వెంకటలక్ష్మి, నేర్పించే టీచర్ పి.లావణ్య గారు మరియు 40 మంది మహిళలు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ తిరుపతి పార్లమెంటు సమాచార కమిటీకి

**ఎన్నికైన తడ శ్రీనివాసులు**

**వరదయ్యపాలెం, జూన్ 24, ప్రభాతవార్త**



వరదయ్యపాలెం మండలం జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న తడ శ్రీనివాసులు జనసేన పార్టీ అధికారికంగా తిరుపతి పార్లమెంటరీ కమిటీ సభ్యునిగా ఎన్నిక చేయడం చాలా సంతోషం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ స్థాపించినప్పుడు నుంచి పార్టీ కోసం నియోజకవర్గ స్థాయిలో అహర్నిశలు కష్టపడుతూ పార్టీ అధ్యక్షులు శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పార్టీ పిలుపు మేరకు పార్టీ కార్యక్రమాలు అన్ని చేస్తూ పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్య నియోజకవర్గంలో జనసేన పార్టీని ముందుకు తీసుకెళ్తూ అహర్నిశలు కష్టపడుతున్న తడ శ్రీనివాసులు తిరుపతి పార్లమెంట్ కమిటీలో సభ్యునిగా ఎన్నిక చేయడం చాలా సంతోషం అలాగే పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నాపై నమ్మకం ఉంచి నాకు ఈ బాధ్యతను ఇచ్చినందుకు పార్టీ అధ్యక్షులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## జూన్ 26, 27, 28న తపన ఎక్స్ పో



తిరుపతి హెల్త్, జూన్ 24, ప్రభాతవార్త తిరుపతి ప్రాచీన తపాలా బిళ్ళలు, నాణేల సేకరణ తపన ఎక్స్ పో ప్రదర్శన నిర్వహి స్తున్నామని నిర్వాహకులు భీమవరం చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమం తిరుచానూరు రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా శ్రీ బాలాజీ కళ్యాణమండపం వద్ద ఉదయం 10 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు శుక్ర,శని,ఆది వారములలో మూడు రోజులపాటు ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ ప్రదర్శనలో భారత దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సేకరణ కర్తలు, పరిశోధకులు,డీలర్లు, అరుదైన చారిత్రక ప్రాముఖ్యత కలిగిన నాణ్యాలు,కరెన్సీ నోట్లు, తపాల బిల్లలు,ఈ ఎక్స్ పో లో ప్రదర్శించ బడతాయన్నారు.ఈ ప్రదర్శనలో మొగల్ చక్రవర్తి జహంగీర్ ముద్రించిన 12 కేజీల బరువున్న బంగారు నాణెము నమూనా, భారత ప్రభుత్వం విడుదల చేసిన పది రూపాయల నాణ్యం నుంచి 1000 రూపాయల నాణ్యం మరియు ప్రపంచపు అతి పెద్ద నోటు బురుంది దేశం విడుదల చేసిన నోటు మరియు బ్రిటీష్ వారికి సంబంధించిన వెండి నాణ్యాలు,బంగారు నాణ్యాలు,నోట్లు,స్టాంపులు, ప్రపంచ దేశాలు విడుదల చేసిన ఒక కేజీ బరువున్న వెండి నాణ్యాలు ఈ ప్రదర్శనలో ప్రదర్శించ బడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సేకరణ కర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రదర్శనను విజయవంతం చేయాలని తపన నిర్వాహకులు కోరారు.

## ప్రజల సమస్యలు పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

**ఎంపీపీ సౌందర్య, వైస్ ఎంపీపీ విజయ్ రెడ్డి**

**పెనగలూరు, జూన్ 24 ప్రభాతవార్త**



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలంలో ప్రజల సమస్యలు వేగంగా పరిష్కారం చేసే విధంగా అధికారులు కృషి చేయాలని ఎంపీపీ కొండూరు సౌందర్య, వైస్ ఎంపీపీలు కొండూరు విజయ్ రెడ్డి, బి. రోశయ్య తెలిపారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన పెనగలూరు మండల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండల స్థాయి అధికారులు వారి శాఖలలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజా ప్రతినిధులకు తెలియజేసారు. శాఖల వారీగా సమీక్ష చేసారు. వెలుగు కార్యాలయంలో ఉన్న కుట్టుమిషన్లు వెంటనే లబ్ధిదారులకు పంచే విధంగా చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ కొండూరు విజయ్ రెడ్డి, ఏపీఎం నిరంజన్ కుమార్‌కు చెప్పారు. ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహిళలపై వేధింపులపై, మైనర్లు వాహనాలు నడపటంపై, మొబైల్ పోయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎటువంటి సమస్యలు ఉన్నా పోలీసు వారిని సంప్రదించాలని సూచించారు. ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉదయగిరి సుబ్బరాయుడు, ఎంపిటిసిలు శ్రీనివాసుల నాయుడు, సహబుద్దీన్, లక్ష్మి దేవి, కో ఆప్షన్ సభ్యుడు లాడెన్, ఎంపీడీవో విజయా రావు,డిటి సుమని, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వాహనాలపై విస్తృత తనిఖీలు

**– రూ.3.70 లక్షలకుపైగా పెనాల్టీలు విధింపు**

రైల్వే కోడూరు అర్బన్, జూన్ 24 ప్రభాత వార్త



తిరుపతి జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో మోటారు వాహన తనిఖీ అధికారులు కోడూరు ప్రాంతంలో విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మోటారు వాహన చట్టం మరియు నిబంధనలను ఉల్లంఘించిన 20 వాహనాలపై కేసులు నమోదు చేశారు. తనిఖీల సందర్భంగా త్రైమాసిక పన్ను చెల్లించకుండా నడుపుతున్న ఒక ఇన్నోవా వాహనాన్ని గుర్తించి, రూ.2,20,000 పెనాల్టీ విధించి వాహనాన్ని స్వాధీనపరచుకున్నారు.అదేవిధంగా, అధిక బరువుతో ప్రయాణిస్తున్న రెండు లారీలపై రూ.50,000 అపరాధ రుసుము విధించారు. అలాగే త్రైమాసిక పన్ను చెల్లించని ఇతర వాహనాలపై కలిపి రూ.1,00,000 పెనాల్టీ విధించారు. ఈ తనిఖీలలో మోటారు వాహన తనిఖీ అధికారులు వెంకటరమణ నాయక్, ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వాహన యజమానులు మరియు డ్రైవర్లు విధిగా మోటారు వాహన చట్టాలు, నియమ నిబంధనలను పాటించాలని, వాహనాలకు సంబంధించిన పన్నులు, పత్రాలు ఎప్పటికప్పుడు చెల్లుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అలాగే రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## జులై 2న రైల్వేకోడూరుకు సీఎం చంద్రబాబు రాక....

**జిల్లా యంత్రాంగం ఏర్పాట్లపై దృష్టి**

రైల్వేకోడూరు రూరల్ జూన్ 24(ప్రభాతవార్త)::



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జులై 2వ తేదీన రైల్వేకోడూరు నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లపై దృష్టి సారించింది.ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు బుధవారం పలు ప్రాంతాలలో స్థల పరిశీలనలు చేపట్టారు. సభ నిర్వహణకు అనువైన ప్రదేశాల ఎంపికలో భాగంగా శెట్టిగుంట గ్రామ ప్రధాన రహదారి పరిసర ప్రాంతాలతో పాటు మంగంపేట ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.సభా వేదిక ఏర్పాటు,ప్రజలకు సౌకర్యవంతమైన కూర్చునే ఏర్పాట్లు,వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ,భద్రతా చర్యలు,తాగునీరు,వైద్య సదుపాయాలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్,డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్ అధికారులతో కలిసి పర్యటించి ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.అలాగే వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో కమీషన్ క్వాలిటీ కంట్రోల్ సిఎస్,డిపిఓ సుశీల దేవి,తహసిల్దార్ కోనేటి అమర్నాథ్,టిడిపి టౌన్ ప్రెసిడెంట్ పోకలమని,క్లస్టర్ ఇంచార్జి పటాన్ మోలా,టిడిపి సీనియర్ నాయకులు నీలకంఠయ్య తదితరులు పాల్గొన్నారు..

## వేరుశనగ సాగుపై శిక్షణ




రేణిగుంట జూన్ 24 ప్రభాతవార్త రేణిగుంట మండలం కరకంబాడి పంచాయితీ చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం నందు న్యూ ఢిల్లీ చెందిన భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి సహకారంతో బుధవారం నూనెగింజలలో సామూహిక మొదటి తరహా ప్రదర్శన నందు వేరుశనగ సాగులో యాజమాన్య పద్ధతులపై శిక్షణా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డా.ఎస్.శ్రీనివాసులు, మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా రైతుల కోసం జిల్లాలో చేస్తున్న సేవలను వివరించారు. ప్రస్తుతం పంపిణీ చేస్తున్న విశిష్ట వేరుశనగ రకం సరైన యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా 100 నుండి 105 రోజుల పంట కాలం కలిగి, పురుగులు తెగుళ్ళను తట్టుకొని ఎకరాకు 18 నుండి 20 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుందని తెలిపారు. విత్తన శుద్ధి, భూసార పరీక్షా ఆదారిత ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్య రక్షణ, సమగ్ర ఎరువుల యాజమాన్యం, సమగ్ర వ్యవసాయ విధానం, నేల నీటి సంరక్షణ పద్ధతుల పై రైతులకు వివరించారు. సదస్సు నందు శాస్త్రవేత్తలు దివ్య, సుధాకర్, రాము కుమార్, డా. సంతోష్, తిరుపతి, కార్వేటినగరం మండలాలకు చెందిన కేశవకుప్పం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమం విజయవంతానికి ఓటర్లు సహకరించాలి - తహసీల్దార్

సత్యవేడు, జూన్ 24 ప్రభాతవార్త:



ఓటర్ల జాబితాను కచ్చితత్వంతో నవీకరించడానికి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి ఓటర్లు సహకరించాలని తిరుపతి జిల్లా సత్యవేడు తహసీల్దార్ శివప్రసాద్ కోరారు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నియోజకవర్గంలో రెండు లక్షల 16 వేల 102 ఓటర్లకు సంబంధించి ప్రత్యేక సమగ్ర సవరణ కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. జూన్ 15వ తేదీ నుంచి 279 మంది బీఎల్‌వోలు ద్వారా సర్ కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు. 2002 ఓటర్ల జాబితా ఆధారంగా ప్రతి ఓటరుకు సంబంధిత బీఎల్‌వోలు రెండు ఎన్యుమరేషన్ ఫాములు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి ఓటరు వీటిని పూరించి ఎన్యుమరేషన్ ఫామ్ తిరిగి బీఎల్‌వోలకు అందజేయాలన్నారు. ఈ నేపథ్యంలోనే సత్యవేడు మండలంలో 38,679 మంది ఓటర్లకు 37,328 మందికి ఎన్యుమరేషన్ ఫామ్ ఇవ్వడం పూర్తయిందన్నారు. ఇందులో ఇప్పటికే 9 శాతం ఎన్యుమరేషన్ ఫామ్ బీఎల్‌వోలు తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే నాగలాపురం మండలం 27002 ఓటర్లు, పిచ్చాటూరు 25057, కేవీబీపురం 33,748, నారాయణవనం 28,182, వరదయ్యపాళెం 37,391, బుచ్చినాయుడు కండ్రిగ 26043 మంది ఓటర్లకు సంబంధించి జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతున్నట్టు ఆయన వివరించారు. అయితే ఓటర్లు కూడా ఆయా బీఎల్‌వోలకు సహకరించి సర్ కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేయాలన్నారు. దీంతో పాటు డూప్లికేట్ ఓటు నమోదు గుర్తించి తొలగించడానికి సహకరించాలన్నారు.

## వీఆర్‌ఏలకు కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలి

సత్యవేడు, జూన్ 24 ప్రభాతవార్త:



సత్యవేడు మండలంలోని రెవెన్యూ శాఖలో పని చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్ఏ)లు వివిధ కారణాలు రీత్యా మరణించి ఉన్న వీరి కుటంబీకులకు జీవనోపాధి కల్పించి వెంటనే ఆదుకోవాలని ఏపీ వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నల్లిపోగు నాగేశం, కొమిటి గుంట శ్రీహరి, సత్యవేడు తహసీల్దార్‌ని ప్రత్యేకంగా వీఆర్‌ఏలతో కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కరువై వీఆర్‌ఏ కుటుంబాలు తల్లడిల్లుతున్నారని దశాబ్దాలు తరబడి రెవెన్యూశాఖలో ప్రభుత్వ విధులు నిర్వహించారని, వీరు అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుపేదలు అని వారు తహసీల్దార్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన వారి యొక్క స్థానంలలో వారి కుటుంబీకులకు వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టి ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వీఆర్‌ఏలకు పెండింగ్ వేతన బకాయిలు ఉన్నాయని పరిశీలించి సకాలంలో బిల్లులు పెట్టి సహాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు చిరంజీవి, అలగర్షన్, మధుబాబు, సుధాకర్, అలివేలు, అనురాధ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో టిడిపి విజయానికి కలిసి కట్టుగా పని చేద్దాం

**సత్యవేడు నియోజకవర్గ టిడిపి బూత్ ఏజెంట్ ఇంచార్జీ**

నారాయణవనం, జూన్ 24 ప్రభాతవార్త :



త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అందరం కలిసి కట్టుగా పని చేద్దామని సత్యవేడు నియోజకవర్గ టిడిపి బూత్ ఏజెంట్ ఇంచార్జీ, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ కోరారు. బూత్ లెవల్ సమీక్ష సమీవేశం నారాయణవనం శ్రీ దూండి వినాయకుని ఆలయం ఆవరణలో బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపిలో ఎన్ని వర్గాలు, విభేదాలు వున్న మనమందరం ఒక్కేటేనన్నారు. తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి చేసే వారితో పాటు మంచితనం కలిగిన వారినే గెలిపించుకోవాలన్నారు. త్వరలో జరిగే సర్పంచ్, ఎంపిటిసి, జడ్పీటీసీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించుకొని సిఎం చంద్రబాబుకి గిఫ్ట్‌గా ఇద్దామన్నారు. కార్యకర్తలకు చిన్న సమస్య వచ్చిన నేనున్నానని భరోసా ఇచ్చారు. అనంతరం సుమన్‌కుమార్‌ను దుశ్శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ఎంపిపి టి సుబ్రమణ్యం, నాయకులు అచ్చుకట్ల హరి, మాణిక్యంరెడ్డి, బాలమురుగన్, ఊరప్ప, బిఎం నరేష్, పురుషోత్తం, సోమశేఖర్, మునెయ్య, దానా పెరుమాల్, మోహన్‌బాబు, బాలయ్య. దేవరాజులు, సుబ్రమణ్యం, గుజ్జెలి మహేష్, కె సుధాబాబు,ఎస్ శంకరయ్య, వెంకటేష్, రమేష్‌బాబు, డి ఆరుముగం, ప్రసన్న, చిన్న, కె నాగయ్య, హేమాద్రి, ఎన్ రమేష్, కె చీరాలయ్య, రాజేష్, మణి, మండల నలుమూలల నుంచి కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు

## ధ్వజ అవరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

**నారాయణవనం, జూన్ 24 ప్రభాతవార్త :**



మండలకేంద్రంలోని నారాయణవనంలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం చంపకవల్లీ సమేత పరాశారేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ చివరిరోజు బుధవారం ఉదయం 11గంటలకు చక్రస్నానం చేశారు. విశేషపూజలను నిర్వహించిన తర్వాత చక్రస్నానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి ధ్వజ అవరోహణంతో ఉత్సవాలను ముగించారు. భక్తులకు టిటిడి అధికారులు అన్నప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి మంత్రిని కలసిన మాజీ ఎమ్మెల్యే హేమలత

సత్యవేడు, జూన్ 24 ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే హేమలత తిరుపతిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో రాజకీయ ఒడిదుడుకులు తీవ్రంగా ఉన్నాయని వీటికి చక్కదిద్దడం, మరలా పునరావతం అవడం పనిగా జరుగుతుందని ఆయన తెలియజేసినట్లు పేర్కొన్నారు.

## మొట్టమొదటి యులిప్ ఐసీఐసీఐ ప్రూ సిగ్నేచర్ సెక్యూర్ ప్లాన్

**తిరుపతి విద్య జూన్ 24 ప్రభాత వార్త**

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ఐసీఐసీఐ ప్రూ సిగ్నేచర్ సెక్యూర్ పేరుతో సరికొత్త ప్లాన్‌ను ఆవిష్కరించింది. భారతీయ జీవిత బీమా రంగంలో కచ్చితమైన మెచ్యూరిటీ ప్రయోజనం అంతర్గతంగా పొందుపరిచిన మొట్టమొదటి యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్ (యులిప్) కావడం విశేషం.ఐసీఐసీఐ ప్రూ సిగ్నేచర్ సెక్యూర్ అనేది నాన్‌పార్టిసిపేటింగ్ లింక్డ్ ఇండివిద్యువల్ సేవింగ్స్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్. పన్ను ఆదాతో పాటు కచ్చితమైన ప్రయోజనాలను కోరుకునే వినియోగదారుల కోసం దీనిని ప్రత్యేకంగా రూపొందించారు.ఈ సందర్భంగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ వికాస్ గుప్తా మాట్లాడుతూ, కస్టమర్లు ఒకేసారి పెట్టుబడి పెట్టేందుకు ఈ ప్రొడక్ట్ అవకాశం కల్పిస్తుందని తెలిపారు. అదే సమయంలో మరింత నమ్మకంతో తమ దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలపై దృష్టి సారించేందుకు ఇది సహాయపడుతుందన్నారు.ఈ ప్లాన్ పాలసీ కాలపరిమితి అంతటా లైఫ్ కవర్‌ను కూడా అందిస్తుందని, తద్వారా కస్టమర్లు తమ కుటుంబ సభ్యుల ఆర్థిక భవిష్యత్తుకు భరోసా కల్పించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా, ఈ ప్రొడక్ట్ ప్రారంభంలో చెల్లించిన ప్రీమియంపై 140 శాతం వరకు గ్యారెంటీడ్ మెచ్యూరిటీ బెనిఫిట్‌ను అందిస్తుందని వివరించారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవనం నిషేధం

**–స్పెషల్ డ్రైవ్‌లో ఆరుగురిపై కేసులు నమోదు...మద్యం బాటిల్స్ సీజ్**

తిరుపతిరూరల్,జూన్ 24 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ ప్రొహిభిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నిషేధమని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.నరసానాయుడు తెలిపారు. సి.ఐ ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న ఆరుగురిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నున్న మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని, వారిపై కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడంపై నిషేధమని సి.ఐ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని సి.ఐ. నరసానాయుడు హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎక్సైజ్ ఎస్.ఐ వి.కవీశ్వరనాయుడు, కానిస్టేబుల్ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో ఫైనాన్షియల్ లిటరసీపై శిక్షణ

**తిరుపతిరూరల్, జూన్ 24 ప్రభాతవార్త:**




యువతకు ఆర్థిక అవగాహన పెంపొందించేందుకు మూడురోజుల ఫైనాన్షియల్ లిటరసీ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. తిరుపతి యూత్ హాస్టల్‌లో ఈనెల 22 నుంచి 24వరకు హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో రూరల్ ఎంపవర్‌మెంట్ ఫౌండేషన్ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణలో నిరుద్యోగ యువత, మహిళలు, సోషల్ వర్కర్లు పాల్గొన్నారు. ఇన్సూరెన్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చి, సర్టిఫికేట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ టి.పార్వతి, కో–ఆర్డినేటర్ ఎన్.దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కేవీబీ పురంలో మండల జనరల్ బాడీ సమావేశం

**కేవీబీ పురం, జూన్ 24 ప్రభాతవార్త:**




మండల కేంద్రమైన కేవీబీ పురం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం ఎంపీపీ రాయదుర్గం మునిలక్ష్మి నందకుమార్ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం ఎంపీడీవో మాలతి నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ సమావేశంలో మండల స్థాయి అధికారులతో మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పక్కా గృహాల నిర్మాణాన్ని గురించి వన్ పాయింట్, ఫైవ్ టు పాయింట్ టు విధానాల గురించి హౌసింగ్ అధికారులు వివరించారు. అమ్మఒడి, తల్లికి వందనం వంటిపథకాలను తమ విద్యార్థులు పొందేందుకు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీవో పేర్కొన్నారు. జూలై నుంచి 1320 వేల రూపాయలు తల్లికి వందనం కూడా పంపిణీకి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు. 115 మంది విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ లేకుండా ఉందని, ఆ 115 మంది విద్యార్థులు ఆధార్ చేసుకోవాలని మొత్తం 4656 మంది విద్యార్థులు నమోదు ఉండాలని, ఇందులో 115 మంది విద్యార్థులు ఆధార్ పొందాల్సి ఉందని ఎంఈవో లక్ష్మిపతి, రవికుమార్‌లు తెలిపారు. ఉపాధిహామీ పథకం ఈ నెలకు ముగిస్తుందని ప్రవేశపెట్టిన పథకం ప్రారంభమవుతుందని ఏపీవో భాస్కర్ పేర్కొన్నారు. బిల్లులు కూడా సకాలంలో చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అలా నిర్ణయం ప్రకారం చెల్లించకపోతే 0.05 ఆర్టీసీ అధికారులు కాని, ఆర్టీసీ బస్సులు సక్రమంగా నడవడం లేదని వస్తే రైలు మార్గం వస్తే రైలు మార్గం వెళ్తామని పలువురు సభ్యులు ఎంపీడీవోని కోరారు. పూల తోటలకు, పండ్ల తోటలకు రకాల పంటలు పెట్టడానికి ప్రభుత్వంపూర్తి స్థాయి సబ్సిడీ అందిస్తుందని, సబ్సిడీ ద్వారా పండ్ల రకాల తోటలు పెట్టే పథకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని, కావున రైతులు ముందుకు రావాలని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు, ఐసీడీఎస్ అధికారులు కల్పలత, రాజేశ్వరి, ఆర్అండ్‌బీఏలు, ఏఈలు,ఇరిగేషన్‌శాఖఏఈలు,ఆర్టీసీ డిపో శాఖ అధికారులు, ఏపీవో, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

## బోడిరెడ్డి కండ్రిగలో అమ్మవారి జాతర

**కేవీబీ పురం, జూన్ 24 ప్రభాతవార్త:**

కేవీబీ పురం మండలం మహాదేవపురం(బోడిరెడ్డికండ్రిగ) గ్రామంలో బుధవారం అత్యంతవైభవంగా అమ్మవారి జాతర జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ఇంటింటా పూజలతో అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు అందించి పూజలు చేశారు. గంగమ్మతల్లి ఆశీస్సులతోనే మా గ్రామం అభివృద్ధి చెందుతా ఉందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి, రాత్రి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అంగేరి శ్రీనివాసులు, సతీష్, నాగరాజు, విజయకుమార్, జయరాం, పూజారి కొప్పేటి మునివేలు, దేశమ్మ, జ్యోతి, రాము తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ధర్మరాజు విగ్రహ ప్రాణప్రతిష్ట

రామచంద్రాపురం, జూన్ 24 ప్రభాతవార్త:



సి.రామాపురంలోని ధర్మరాజు సహిత ద్రౌపథి అమ్మవారి ఆలయంలో బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ధర్మరాజు స్వామి వారి విగ్రహ ప్రాణప్రతిష్ట నిర్వహించారు. బుధవారం ఉదయం వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయ ప్రాంగణంలో సుదర్శన యాగం నిర్వహించారు. అనంతరం స్వామివారి గర్భగుడలోనికి ధర్మరాజు స్వామి వారి మూలవిరాట్‌ను తరలించి ప్రాణప్రతిష్ట గావించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా రామాపురం గ్రామానికి చెందిన చంద్రగిరి రంజిత్‌కుమార్ రెడ్డి దంపతులు వ్యవహరించారు. అనంతరం గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కొట్టే నరశింహారెడ్డి, రాజగోపాల్ రెడ్డి, మునిరామిరెడ్డి, ధనంజయ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు

**చంద్రగిరి, జూన్ 24 ప్రభాతవార్త:**



స్థానిక శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో బుధవారం అమ్మవారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. గత 90 రోజుల పాటు అమ్మవారి భక్తులు నగదు రూపేనా హుండీ ద్వారా రూ.7,62,550/–లు సమర్పించారు. హుండీ లెక్కింపును పిచ్చాటూరు, రామగిరి గ్రూప్ దేవస్థానం ఈఓ హేమ చంద్ర పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యురాలు యు.భారతి, పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ పట్టాభి రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట

రేణిగుంట, జూన్ 24 ప్రభాతవార్త



రేణిగుంట మండలం గాజులమండ్యం శ్రీపట్టాభి రామస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా బుధవారం అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ట జరిగింది. సుప్రభాతంతో ప్రారంభమై విశేష పూజలు అభిషేకాలు చతుర్దశ కలశ సహిత మహాశాంతి, వేద పండితులు మంత్రోచ్ఛరణలతో జరిపించారు. సాయంత్రం కుంభారాధన, మహాహో మాల నిర్వహణ అనంతరం భక్తులకు ఆలయ ధర్మకర్తలు రెడ్డివారి గోపాల కృష్ణారెడ్డి, రెడ్డివారి దినకర రెడ్డి, రెడ్డివారి వేద కిషన్ రెడ్డి సమక్షంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. గురువారం మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, జరుగుతుందని ధర్మకర్తలు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో మహా కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొని శ్రీ సీత లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీ పట్టాభి రాముని అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.



## అమ్మవారిని దర్శించుకున్న గాలి జగదీష్

**పుత్తూరు రూరల్, జూన్ 24 ప్రభాతవార్త:**

పుత్తూరు మండలం తిరుమలకుప్పం గ్రామంలో గంగమ్మజాతర మహోత్సవంలో గాలి జగదీష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

